శుక్రవారం
24-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 270
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మేమొస్తేనే మార్పొస్తుంది

టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) అధికారంలోకి వస్తే టర్కీలో మార్పు రాగలదని ఆ పార్టీ తాజా ప్రకటనలో ఉద్ఘాటించింది. ఎర్డోగన్ శకానికి ముగింపు పలకడమే లక్ష్యమని తెలిపింది. ప్రస్తుత ఏకేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు, ఎర్డోగన్ నియంతృత్వానికి చరమగీతం పాడేందుకు పార్టీవర్గాలు కంకణబద్ధులై శ్రమిస్తున్నట్లు టీకేపీ వెల్లడించింది.

2లో

రాహుల్‌కు రెండేళ్ల జైలు

- బెయిల్ మంజూరు
- హైకోర్టులో అప్పీలుకు 30 రోజుల గడువు

సూరత్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ గుజరాత్, సూరత్ కోర్టు గురువారం ఆదేశాలిచ్చింది. 2019లోని పరువు నష్టం దావాకు సంబంధించి ఈ శిక్షను విధించింది. దొంగల దొంగలందరి ఇంటిపేరు 'మోదీ' ఏమిటంటూ ఆయన చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ కేసు నమోదైంది. చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ హెచ్‌హెచ్ వర్మ ఈ మేరకు రాహుల్‌కు శిక్ష విధించారు. ఐపీసీలోని 499, 500 సెక్షన్ల కింద రాహుల్‌ను దోషిగా నిర్ధారించింది. అయితే ఆయనకు బెయిల్‌ను కూడా మంజూరు చేసింది. 30 రోజుల్లోగా ఉన్నత న్యాయస్థానంలో ఫిర్యాదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అప్పటివరకు శిక్షను సస్పెండ్ చేసింది. ఈ మేరకు వివరాలను రాహుల్ న్యాయవాది బాబు మంగుకియా తెలిపారు. ఇదిలావుంటే 'నిందితుడు పార్లమెంటు సభ్యుడు. ఆయన మాట్లాడే మాటల ప్రభావం ప్రజలపై ఎక్కువగా ఉంటుంది. అది ఈ నేరం తీవ్రతను పెంచుతుంది. దోషికి తక్కువ శిక్ష విధిస్తే ఎవరైనా ఎవరినీ అవమానించవచ్చు అన్న తప్పుడు

- మిగతా 2 లో

బీజేపీ కక్ష సాధింపు రాజకీయం

రాహుల్‌గాంధీని ఎన్నికలకు దూరం చేయడానికే శిక్ష

8లో

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ

అనూహ్య ఫలితం

- వైసీపీకి దిమ్మతిరిగింది
- టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ గెలుపు
- వైసీపీ నుంచి ఆరుగురి విజయం
- కోలా గురువులు ఓటమి
- టీడీపీ శ్రేణుల్లో సంబరాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అనూహ్య విజయం సాధించింది. 23 ఓట్లతో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ గెలుపొందారు. ఆరుగురు వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. వైసీపీ ఎమ్మెల్యేలు నలుగురు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతో పంచుమర్తి అనురాధ గెలుపు సునాయాసమైంది. దీంతో టీడీపీ శ్రేణుల్లో సంబరాలు మిన్నంటగా...వైసీపీకి ఊహించని షాక్ తగలింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోరఓటమి నుంచి తేరుకోకముందే...ఈ ఎన్నికల్లో వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. వెలగపూడి అసెంబ్లీ కమిటీ హాలులో గురువారం సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరిగింది. ఏడు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ సభ్యులు పోటాపోటీగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 175 ఓట్లకుగాను 175(100 శాతం) పోలయ్యాయి. ఈ ఓట్లన్నీ చెల్లుబాటైనట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు. ఈ ఎన్నికలను వైసీపీ, టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. రెండు పార్టీలు విప్ జారీజేశాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టారు.

బరిలో 8 మంది అభ్యర్థులు

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 7 స్థానాలకుగాను 8 మంది బరిలో నిలిచారు. వైసీపీ తరపున పెన్మత్స సూర్యనారాయణరాజు, కోలా గురువులు, బొమ్మి ఇజ్రాయిల్, మర్రి రాజశేఖర్, జయమంగళ వెంకటరమణ, పోతుల సునీత, చంద్రగిరి ఏసురత్నం పోటీ చేయగా...టీడీపీ అభ్యర్థిగా పంచుమర్తి అనురాధ పోటీచేశారు. బరిలో ఎనిమిది మంది అభ్యర్థులు ఉండటంతో పోటీ అనివార్యమైంది. వైసీపీ అభ్యర్థులు మర్రి రాజశేఖర్(22), బొమ్మి ఇజ్రాయిల్(22), చంద్రగిరి ఏసురత్నం(22), పోతుల సునీత(22), పెన్మత్స సూర్యనారాయణరాజు(22) గెలుపొందారు. వైసీపీ అభ్యర్థులు కోలా గురువులుకు 21 ఓట్లు, జయమంగళ వెంకట రమణకు 21 ఓట్లు సమానంగా వచ్చాయి. రెండో ప్రాధాన్యత ఓట్లతో జయమంగళ వెంకట రమణ గెలుపొందారు. కోలా గురువులు ఓటమి పాలయ్యారు. టీడీపీ నుంచి బరిలో దిగిన పంచుమర్తి అనురాధకు 23 ఓట్లు వచ్చాయి.

ఓటేసిన సీఎం జగన్, చంద్రబాబు

తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ తర్వాత సభ్యులు విడతల వారీగా వచ్చి ఓట్లు వేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు తన నివాసం నుంచి టీడీపీ ఎమ్మెల్యేలతో కలిసి వచ్చి ఓటు వేశారు. ఒకవైపు అసెంబ్లీ జరుగుతుండగానే మరోవైపు విడతల వారీగా ఎమ్మెల్యేలు ఓట్లేశారు. వైసీపీ కౌంటింగ్ ఏజెంట్లుగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, పేర్ని నాని,

- మిగతా 2 లో

ఆ ఇద్దరెవరు?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్ వైసీపీ కొంపముంచింది. ముందుగా ఊహించినట్లే వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి వ్యతిరేకంగా ఓటేశారు. వీరికితోడు మరో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడ్డారు. ఈ క్రాస్ ఓటింగ్‌తో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ గెలుపొందారు. ఇది రాజకీయంగా వైసీపీకి ఎదురుదెబ్బ. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెబల్ బెడద, క్రాస్ ఓటింగ్ ఉంటుందనే సమాచారంతో వైసీపీ

- వైసీపీ కొంపముంచిన క్రాస్ ఓటింగ్
- టీడీపీ అభ్యర్థికి నలుగురి ఓట్లు

- మిగతా 2 లో

పోలవరం ఎత్తు 41.5 మీటర్లే

- ప్రాజెక్టు నీటి నిల్వపై కేంద్రం
- సగం నిర్వాసిత కుటుంబాలకే ఏపీ సాయం
- మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉన్నా చేయలేదు
- పార్లమెంటులో మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించేది లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క ప్రకటనలు గుప్పిస్తుండగా... కేంద్ర ప్రభుత్వం 41.15 మీటర్లకే పరిమితం చేసినట్లు పార్లమెంటు సాక్షిగా ప్రకటించింది. ఇది తొలిదశలో అని మెలిక పెట్టినప్పటికీ దశలవారీ నిబంధనలతో ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం ఏపీకి కేంద్రం చేస్తున్న మరో మోసంగా పేర్కొనవచ్చు. 2022 నాటికే ప్రాజెక్టు మొత్తాన్ని పూర్తి చేస్తామని చెప్పిన కేంద్రం...ఇప్పుడు 2023లో తొలిదశ, మలిదశ అంటూ ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం అన్యాయం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ డాక్టర్ సత్యవతి గురువారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తిశాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. తొలిదశలో ప్రాజెక్టులో నీటి నిల్వను 41.15 మీటర్లకే పరిమితం చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

తొలిదశ సహాయ, పునరావాసం కూడా అంతవరకేనని తేల్చి చెప్పారు. వాస్తవానికి తొలిదశ సహాయ, పునరావాసం ఈ ఏడాది ఫిబ్రవరి నాటికే పూర్తి కావాల్సి ఉండగా, అందులో సగం కూడా కాలేదన్నారు. తొలిదశలో మొత్తం 20,946 నిర్వాసిత కుటుంబాలకు సహాయ, పునరావాసం కల్పించాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 11,677 నిర్వాసిత కుటుంబాలకే సహాయం అందించినట్లు చెప్పారు.

మిగతావారికి సహాయ, పునరావాసం మార్చి 2023 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా ఇంతవరకు చేయలేదని ప్రహ్లాద్ సింగ్ పటేల్ పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

పోలవరం ఎత్తుపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

- సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు తొలిదశలో నీటినిల్వ 41.15 మీటర్లు
- పూర్తిస్థాయిలో 45.7 మీటర్లు ఎత్తు నిర్మించి తీరుతాం
- ప్రతి ముంపు కుటుంబానికి రూ.10 లక్షలిస్తాం
- అసెంబ్లీలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, ముందుగా నిర్ణయించిన ప్రకారం 45.7 మీటర్ల ఎత్తులోనే ప్రాజెక్టును నిర్మిస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. అసెంబ్లీలో గురువారం పోలవరం అంశంపై జరిగిన లఘు చర్చలో సీఎం జగన్ మాట్లాడారు. డ్యామ్ భద్రత, సీడబ్ల్యూసీ

- మిగతా 2 లో

హైకోర్టు తరలింపు న్యాయస్థానాల పరిధిలోనే

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారమే అమరావతిలో హైకోర్టు ఏర్పాటైందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. మూడు రాజధానుల పాట పాడుతున్న వైసీపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం న్యాయరాజధానిగా పేర్కొంటున్న కర్నూలుకు హైకోర్టును తరలిస్తున్నారా అంటూ గురువారం రాజ్యసభలో టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రిజిజు స్పందించారు. ప్రస్తుతం అమరావతిలో ఉన్న హైకోర్టు ఏపీ పునర్విభజన చట్టం ప్రకారమే ఏర్పాటైందని వెల్లడించారు. దీన్ని కర్నూలుకు తరలించేందుకు సీఎం జగన్ ప్రతిపాదించారని చెప్పారు. అయితే హైకోర్టు తరలించాలంటే మాత్రం రాష్ట్ర ప్రభుత్వంతో పాటు హైకోర్టు కూడా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. హైకోర్టు తరలింపు ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలో ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 214 నిబంధన ప్రకారం 2018లో కేంద్రం పర్సెస్ దస్ గోపాల్‌రావు, ఇతరుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రేపు నూటడబ్బై ఐదు కూడా ఇలాగే మెల్లగా హుళుక్కా దొరా!

చర్చ లేకుండానే కేంద్ర బడ్జెట్‌కు ఆమోదం

- 12 నిమిషాల్లో ముగిసిన ప్రక్రియ
- పద్దులకూ అంగీకారం - నేడు ఆర్థిక బిల్లుపై చర్చ!
- కొనసాగిన విపక్ష-అధికార పక్షాల నినాదాలు
- లోక్‌సభలో వాయిదాల పర్వం

న్యూదిల్లీ: ఏప్రిల్ ఒకటో తేదీతో మొదలయ్యే ఆర్థిక సంవత్సరానికిగాను రూ.45లక్షల కోట్ల కేంద్రబడ్జెట్‌కు లోక్‌సభ ఆమోదం లభించింది. ఎటువంటి చర్చ లేకుండా బడ్జెట్‌ను ఎగువసభ ఆమోదించింది. మొత్తం ప్రక్రియ కేవలం 12 నిమిషాల్లో ముగిసింది. అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల మీద జేపీసీతో విచారణ జరిపించాలని ప్రతిపక్షాలు, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని అధికారపక్షం చేస్తున్న డిమాండ్లతో రెండవ దశ బడ్జెట్ సమావేశాలు రసాభాస అవుతూనే ఉన్నాయి. రెండు వాయిదాల తర్వాత పద్దులు, ద్రవ్యవినిమయ బిల్లులను ప్రవేశపెట్టారు. అధికార-విపక్షాల పోటాపోటీ నినాదాలతో సాయంత్రం 6 గంటల వరకు లోక్‌సభ వాయిదా పడింది. ప్రభుత్వవ్యయ ప్రణాళికకు సంబంధించి విపక్షాలు సూచించిన సవరణలు, ప్రవేశపెట్టిన కోతల తీర్మానంపై స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించగా వాటిని మూజువాణి ఓటు ద్వారా సభ్యులు తిరస్కరించారు. ఆపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 పద్దులు, ద్రవ్యవినిమయ బిల్లులను ప్రవేశపెట్టారు. వీటిని స్పీకర్ గిలిటన్ చేసి, ద్రవ్యవినిమయ బిల్లుపై అన్ని మంత్రిత్వశాఖల ఓటింగ్ నిర్వహించారు. ప్రతిపక్ష పార్టీల ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేస్తుండగానే పద్దులను

- మిగతా 2 లో

అకాల వర్షాలతో అపారనష్టం

- రైతులకు పరిహారమివ్వండి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు గ్రామంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మిరప పంటను రామకృష్ణ ఇతర సీపీఐ నేతలు గురువారం పరిశీలించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ అకాల వర్షాలకు మిర్చి, పత్తి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవడంతో ఎకరాకు 2 లక్షల నుంచి 3 లక్షల రూపాయల వరకు నష్టం వచ్చిందన్నారు. రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని తెలిపారు. రామకృష్ణ వెంట సీపీఐ ఎన్‌టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రెటరీ దోనేపుడి శంకర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.నగరాముడు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంబోజు శివాజీ, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, చలపతిరావు, ఏఐవైఎఫ్ పట్టణ కార్య నిర్వాహక అధ్యక్షుడు యాంద్రపల్లి భాను తదితరులు ఉన్నారు.

మేమొస్తేనే మార్పొస్తుంది

- ఎర్దోగన్ శకం ముగింపే లక్ష్యం
- మే 14న ఎన్నికల్లో ఒంటరిగా పోటీ
- టర్కీ కమ్యూనిస్టు పార్టీ ప్రకటన

అంకారా: టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) అధికారంలోకి వస్తే టర్కీలో మార్పు రాగలదని ఆ పార్టీ తాజా ప్రకటనలో ఉద్ఘాటించింది. ఎర్దోగన్ శకానికి ముగింపు పలకడమే లక్ష్యమని తెలిపింది. ప్రస్తుత ఏకేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు, ఎర్దోగన్ నియంతృత్వానికి చరమగీతం పాడేందుకు పార్టీవర్గాలు కంకణబద్ధులై శ్రమిస్తున్నట్లు టీకేపీ వెల్లడించింది. మే 14న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. 81 ప్రావిన్సులకు అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలిపింది. అదేరోజు జరగబోయే అధ్యక్ష ఎన్నికల కోసం కమల్ కిలిదారుగ్లుకు మద్దతివ్వాలని పిలుపునిచ్చింది. టర్కీలోని సామ్యవాద, లౌకిక వ్యతిరేక నిరంకుశ పరిపాలనకు చెక్ పెట్టాలంటూనే ఎన్నికల కోసం ఏకతాటిపైకి రావాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పింది. మేలో జరగబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో కలిసిరావాలని కోరింది. చరిత్రాత్మక కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళతామని తెలిపింది. ఎన్నికల కోసం ప్రచారంతో పాటు సంస్థాగత పనుల ద్వారా ఓటర్లలో అవగాహన పెంచుతామని పేర్కొంది. ప్రత్యామ్నాయ నాయకత్వం లేకుండా ప్రజలను అనాథులుగా సోషలిస్టులు చేయరాదన్నది. ఎర్దోగన్ శకాన్ని ముగించాలన్నదే శ్రామికులు, మహిళలు, యువత కోరుకునేదిగా తెలిపింది. టర్కీ మళ్లీ బలంగా ఎదగాలన్నా, స్వతంత్రతను పునరుద్ధరించుకోవాలన్న అది కమ్యూనిజంతోనేనని నొక్కిచెప్పింది. కమ్యూనిజంతోనే ఎర్దోగన్ శకానికి ముగింపు సాధ్యమని పునరుద్ఘాటించింది. ఏకేపీ ఏ విధంగా దేశాన్ని చీకట్లోకి నెట్టివేసినది ప్రజలకు తెలియజేస్తామని వెల్లడించింది. టర్కీ కమ్యూనిస్టు పార్టీ బలంగా, సుస్థిరంగా, స్పష్టమైన వైఖరితో ఉందని పేర్కొంది. ఏకేపీని ఎన్నికల్లో ఓడిస్తే అది నేషనల్ అలయెన్స్ (లిబరల్-ఇస్లామిస్ట్-ఫాసిస్ట్ సంయుక్త శక్తులు) విజయమే అవుతుందని తెలిపింది. ఈసారి ఎన్నికల్లో ఏకేపీతో పాటు ఎర్దోగన్‌కు చెక్ పెట్టడమే కాకుండా మా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తూ ముందుకెళతామని టర్కీ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. సుసంపన్నత, సమానత్వం, సౌభాగ్యత, స్వేచ్ఛ, న్యాయం ఉండే సోషలిస్టు టర్కీ కోసం టీకేపీని నమ్మండి.. టీకేపీకి ఓటు వేయండి... మళ్లీ శిథిలాల కింద నలిగిపోనివ్వం... టీకేపీ వస్తే అంతా మారుతుంది.. టీకేపీతోనే మార్పు వస్తుంది' అని టర్కీ కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

ఉక్రెయిన్‌పై ఏకాభిప్రాయం కష్టమే

ఎస్‌సీఓ సదస్సు కోసం జిన్‌పింగ్‌కు భారత్ ఆహ్వానం

చైనా వ్యవహారాల ఇన్‌చార్జి మా జియా

బీజింగ్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు భారత్ నుంచి షాంఘై కోఆపరేటివ్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందినట్లు ఆ దేశ వ్యవహారాల ఇంచార్జి మా జియా ధ్రువీకరించారు. 'ఎస్‌సీఓ సదస్సు జులైలో జరగనున్నది. ఈ సదస్సుకు ఇంకా తేదీ ఖరారు కావాల్సి ఉన్నందున జిన్‌పింగ్ వెళతారో లేదో చెప్పలేమని' ఆమె అన్నారు. ఉక్రెయిన్ అంశంపై ఏకాభిప్రాయం కోసం జీ20 సదస్సులో భారత్ యత్నించనున్న క్రమంలో అందుకు కనీసం రెండు నెలల ముందు జరిగే ఎస్‌సీఓ సదస్సుకు ప్రాధాన్యత ఏర్పడింది. ఉక్రెయిన్ విషయంలో ఏకాభిప్రాయం కష్టమేనని జియా అభిప్రాయపడ్డారు. 'గతేడాది బాలీ తీర్మానం తర్వాత పరిస్థితి తీవ్రతరమైంది.దీంతో జీ20లో ఉక్రెయిన్‌పై ఏకాభిప్రాయం కుదరడం కష్టసాధ్యం' అని ఆమె అన్నారు. సెప్టెంబరులో జీ20 సదస్సు కోసం అధికారిక ఆహ్వానం జిన్‌పింగ్‌కు అందిందని చెప్పారు. ఎస్‌సీఓతో పాటు సెప్టెంబరు 9-10 తేదీల్లో జరిగే జీ20 సదస్సుకు భారత్ అధ్యక్షత వహిస్తోంది. జూన్ 25న ఎస్‌సీఓ సదస్సు నిర్వహించాలని భారత్ తొలుత ప్రతిపాదించింది. అయితే జూన్ చివరిలో భారత ప్రధాని మోదీ అమెరికా పర్యటన ఉన్నందున ఈ సదస్సును జులై 5 తేదీకి వాయిదా వేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో సరిహద్దు ప్రతిష్ఠంభనకు చర్చల ద్వారా పరిష్కారం సాధ్యమని, భారత్‌గానీ చైనాగానీ యుద్ధాన్ని కోరుకోవడం లేదని జియా వెల్లడించారు. సంక్లిష్ట పరిస్థితులలో వర్కింగ్ మెకానిజం ఫర్ కన్సల్‌టేషన్ అండ్ కోఆపరేషన్ (డబ్ల్యుఎంసీసీ) చర్చలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2020 ఏప్రిల్-మేలో ఎల్‌ఏసీ వద్ద సైనిక ఘర్షణ తర్వాత ఇద్దరు దేశాధినేతలు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించలేదు. గతేడాది బాలీలో జరిగిన జీ20 సదస్సులో మోదీ, జిన్‌పింగ్ మధ్య కరచాలనం, అనధికారిక ఒప్పందానికి ప్రాధాన్యత ఏర్పడింది. కాగా ఎస్‌సీఓ సభ్యదేశాల్లో భారత్, రష్యా, చైనా, కిర్గిగ్ రిపబ్లిక్, కజకస్తాన్, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, పాకిస్తాన్ ఉన్నాయి. ఇది 20ఏళ్ల కిందట ఏర్పడింది.

ఫ్రాన్స్ కార్మిక సంఘాల ఉద్యమం

స్తంభించిన రవాణా వ్యవస్థ- నిలిచిన రైళ్లు, విమానాలు

పారిస్: ఫ్రాన్స్‌లో మాక్రాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానపరమైన నిర్ణయాలపై ప్రజాగ్రహం కట్టులు తెంచుకుంది. పదవీ విరమణ వయస్సును 62 నుంచి 64కు పెంచుతూ ప్రభుత్వం చట్టం తేవడం, ఓటింగ్ లేకుండా పార్లమెంటు ఆమోదించడంతో పరిస్థితి మరింత జటిలమైంది. పింఛన్ సంస్కరణలకు వ్యతిరేకంగా జనవరి నుంచి జరుగుతున్న ఆందోళనలు, సమ్మెలు, నిరసనలు, ప్రదర్శనలు మరింత తీవ్రరూపం దాల్చాయి. దీంతో గురువారం ఫ్రాన్స్ అట్టుడికిపోయింది. కార్మిక సంఘాలు ఉద్యమించడంతో ప్రజా రవాణా పూర్తిగా స్తంభించింది. రైల్వేస్టేషన్లను, బస్ డిపోలను, ప్రధాన కూడళ్లను నిరసనకారులు దిగ్బంధించారు. సామూహిక నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పారిస్‌లోని చార్లస్ డి గౌలే విమానాశ్రయం, రిఫైనరీలలో పని ఆగిపోయింది. హైస్పీడ్ రైళ్లతో పాటు స్థానికంగా నడిచే రైళ్లు నిలిచిపోయాయి. పారిస్ మెట్రోతో పాటు ప్రధాన నగరాల్లో ప్రజా రవాణా స్తంభించింది. ఓర్లీ విమానంలో 30శాతం విమానాలు రద్దయ్యాయి. పింఛన్ సంస్కరణకు వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్రరూపం దాల్చిన క్రమంలో కొన్ని చోట్ల హింస కూడా చోటుచేసుకుంది. 'ఆయనేమీ నియంత కాదు. ప్రజల మాట వినాల్సిందే. వారు ఏం కోరుకుంటున్నారు. వారి అవసరాలు ఏమిటన్నది పరిగణనలోకి తీసుకోవాలి' అని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా పార్లమెంటులో రెండు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టగా మాక్రాన్ ప్రభుత్వం తృటిలో తప్పించుకొన్నది. స్వల్ప మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది. ఫ్రాన్స్‌లో పింఛన్ సంస్కరణలు అవసరమని, రిటైర్మెంట్ వ్యవస్థను సవరించాల్సిందేనని మాక్రాన్ బలంగా వాదిస్తున్న విషయం విదితమే.

'బి' వీసాలతో ఉద్యోగాలకు ఛాన్స్

షరతులు వర్తిస్తాయి: యూఎస్‌సీఐఎస్

వాషింగ్టన్: బిజినెస్, టూరిస్ట్ వీసాల (బీ-1, బీ-2) మీద అమెరికా వెళుతున్న వారికి ఆ దేశంలో కొత్త ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవడం, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వెసులుబాటును అమెరికా ప్రభుత్వం కల్పించింది. అయితే ఇక్కడ కొన్ని షరతులు వర్తిస్తాయని చెప్పకనే చెప్పింది. 'బి' వీసాలతో వివిధ తాత్కాలిక వీసాలకు ఈ వెసులుబాటును కల్పిస్తున్నట్టు స్పష్టంచేసింది. 'బీ-1, బీ-2 వీసాస్టేటస్‌పై కొత్త ఉద్యోగాలు వెతుక్కోవచ్చా అని చాలా మంది అడుగుతున్నారు. అందుకు అనుమతి ఉందన్నదే మా సమాధానం. ఉద్యోగాల ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు' అని యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ట్వీట్ చేసింది. కొత్త ఉద్యోగాల్లో చేరే సమయానికి 'బీ' వీసా స్టేటస్ మారిపోయి ఉండాలని కచ్చితంగా చెప్పింది. అదే సమయంలో ఉద్యోగాలు కోల్పోయిన 60 రోజుల్లోపు దేశాన్ని విడిచి వెళ్లాలని నాన్ ఇమ్మిగ్రెంట్ వర్కర్లకు సూచిస్తున్నట్టు చెబుతారుకానీ ఉద్యోగం కోల్పోతే తమ నాన్ ఇమ్మిగ్రేషన్ స్టేటస్‌ను మార్చుకునేందుకు అర్జీ పెట్టుకోవచ్చు అని యూఎస్‌సీఐఎస్ తెలిపింది. 'స్టేటస్ సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. కంపెల్లింగ్ సర్కమ్ స్టాన్సెస్ (ప్రతికూల పరిస్థితులు) అథారైజేషన్ డాక్యుమెంట్స్' కోసం అప్లై చేసుకోవచ్చు. వీటిల్లో ఒకదానిని 60 రోజుల గడువులోపే దరఖాస్తు చేసుకోవాలి లేకపోతే సంబంధిత వ్యక్తితో పాటు వారిపై ఆధారపడిన వారు సైతం అమెరికాను విడిచి వెళ్లిపోవాలి' అని పేర్కొంది. బీ-1, బీ-2 వీసాలపై ఉద్యోగాలు వెతుకున్న వారు అందులో చేరే సమయానికి వీసా స్టేటస్‌ను కచ్చితంగా మార్చుకోవాలి. అందుకు అధికారులు అనుమతివ్వకపోతే మాత్రం సంబంధిత వ్యక్తులు అమెరికాను విడిచి వెళ్లిపోవాల్సిందేనని తేల్చిచెప్పింది.

సత్యమే నా మతం

- రెండేళ్ల శిక్షపై రాహుల్‌గాంధీ వ్యాఖ్య
- బీజేపీ నిరంకుశత్వానికి పరాకాష్ట-హైకోర్టుకు వెళతాం: కాంగ్రెస్
- నా సోదరుడు భయపడడు- అబద్ధం చెప్పడు : ప్రియాంక
- న్యాయపోరాటం చేస్తాం: ఖడ్గే



న్యూఢిల్లీ: 'నా మతం సత్యం, అహింసాధారితం, సత్యమే నా దైవం... దానిని పొందే మార్గమే అహింస' అన్న మహాత్మాగాంధీ మాటలను ఉటంకిస్తూ తనకు పరువనష్టం కేసులో రెండేళ్ల శిక్ష పడటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. సత్యమే ఆధారంగా దేశం కోసం నిర్భయంగా పోరాడటాన్ని వారి నుంచి నేర్చుకున్నా.. భరతమాత ధీరపుత్రుల నుంచి ధైర్యాన్ని నేర్చుకున్నా' అంటూ మరొక ట్వీట్‌లో స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుకు రాహుల్ నివాళులర్పించారు. రాహుల్ గాంధీకి శిక్ష విధించడం పరికిపింద చర్య, దీనిపై న్యాయపోరాటం చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే పేర్కొన్నారు. ట్విట్టర్ మాధ్యమంగా బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని దుయ్యబట్టారు. 'మోదీ ప్రభుత్వ తప్పులన్నీ బయటకు తెస్తున్నాం... జేపీసీ విచారణ కోసం డిమాండ్ చేస్తున్నాం... అందుకే రాహుల్‌గాంధీ, విపక్షాలపై బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపునకు దిగింది. రాజకీయ ప్రసంగాలపై ఈడీ, పోలీసులను పురమాయిస్తూ కేసులు పెడుతోంది. రాహుల్ వ్యవహారంలో హైకోర్టుకు వెళతాం' అని ట్వీట్ చేశారు. 'బీజేపీ మా వైపు ఒక వేలు చూపితే... దాని వైపు నాలుగు వేళ్లు ఉన్నాయన్న సంగతిని బీజేపీ మరుస్తోందని ఖడ్గే విమర్శించారు. 'వారు న్యాయమూర్తులను మార్చడాన్ని బట్టి ఇలాంటిదేదో జరుగుతుందని ముందే ఊహించాం. మాకు చట్టంపై పూర్తి నమ్మకం కాదు. న్యాయపోరాటం సాగిస్తాం' అని విలేకరులతో మాట్లాడిన ఖడ్గే అన్నారు. సామ, దాన, భేద, దండోపాయం ద్వారా రాహుల్ గళాన్ని అణచివేసేందుకు అధికార యంత్రాంగం యత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. 'నా సోదరుడు ఎన్నడూ భయపడలేదు. ఇప్పుడు కూడా భయపడబోరు. ఆయన జీవితాంతం నిజమే మాట్లాడారు. అదే కొనసాగిస్తారు. దేశ ప్రజల కోసం గళమెత్తుతూనే ఉంటారు' అని ఆమె హిందీలో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ 'ఇది నవభారతం. ఇక్కడ అన్యాయాన్ని ఎదిరిస్తే ఈడీ, సీబీఐ, పోలీసులు, ఎఫ్ఐఆర్‌లు తప్పవు. నిజం మాట్లాడినందుకు, నియంతకు వ్యతిరేకంగా గళమెత్తినందుకు రాహుల్‌ను శిక్షిస్తున్నారు. తప్పును తప్పు అనే ధైర్యం రాహుల్‌కు ఉంది. ఆయన ధైర్యం నియంతను భయపెడుతోంది. అందుకే ఈ శిక్ష. ఈడీ-పోలీసులు.. శిక్షల రూపేణ భయపెట్టే యత్నం. మేము న్యాయపోరాటం తప్పక నెగ్గుతాం' అని పేర్కొన్నారు. కుక్కిన పేను చందంగా నిశ్శబ్ద విపక్షం ఓ మూల పడివుండి... శాసించినట్లు చేసే మీడియా ఉండే భారతదేశాన్నే షా, షెహిన్షా కోరుకునేదని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ 'మోదీ పేరు ఎత్తితేనే అవమానించిన భావించే రోజులొచ్చాయి. ఏ సందర్భంలో ఆ వ్యాఖ్యలు చేశారో తెలుసుకోవాలి. దేశ ప్రజల డబ్బు దోచుకుపోయిన వారినుద్దేశించి రాహుల్ అలా మాట్లాడారు' అని అన్నారు.

రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, భూపేశ్ బాఘెల్ స్పందిస్తూ ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి సత్యం కోసం పోరాటాన్ని మానుకునే వ్యక్తిత్వం రాహుల్ గాంధీది కాదన్నారు. న్యాయపోరాటంలో యావత్ దేశం రాహుల్ పక్షానే ఉన్నదని కాంగ్రెస్ గుజరాత్ నేత అమిత్ చావ్డా అన్నారు. 'మేము కాంగ్రెస్ నేతలం. ఇప్పటివరకు ఎవరికీ తలవంచలేదు. ఇప్పుడు కూడా అంతే. సత్యాన్ని ఎవరూ ఓడించలేరు' అని ట్వీట్ చేశారు.

రాహుల్‌కు రెండేళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

సందేశం సమాజంలోకి వెళుతుంది.'చౌకిదార్ చోర్ హై' వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పిన ఆయనను భవిష్యత్‌లో ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు కూడా సూచించింది. ఆయన తన తీరును మార్చుకోలేదు' అని కోర్టు తీర్పు పేర్కొంది. అంతకుముందు విచారణ క్రమంలో రాహుల్ గాంధీ కోర్టులో మాట్లాడుతూ తనకు ప్రజలంతా సమానమని, ఎవరిపై వివక్ష లేదని, అందరు పౌరులను ప్రేమిస్తానని చెప్పారు. ప్రజా హితవు క్రమంలో ప్రసంగించానన్నారు. రాహుల్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పాయన మాటల్లో ఎవరిని కించపరిచే ఉద్దేశం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదిదారుడికి ఎటువంటి నష్టంగానీ బాధగానీ కలగలేదని. గతంలో ఏ నేరంలోనూ దోషిగా రుజువు కాలేదని, ఎవరి నుంచి మాఫీకానీ క్షమాభిక్ష కోసం అర్థించలేదని వాదించారు. ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ నిందితుడి వ్యక్తిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. ఆయన గతంలో సర్వోన్నత న్యాయస్థానానికి క్షమాపణలు చెప్పారని, భవిష్యత్‌లో ఇలా జరగకూడదని సుప్రీం కోర్టు ఆయనకు హితవు పలికిందని గుర్తుచేశారు. అయినా ఆయన తీరు మారకపోవడంతో సమాజానికి తప్పుడు సందేశం వెళుతుందన్నారు. రెండేళ్ల శిక్ష విధించిన క్రమంలో ఆయన పార్లమెంటు సభ్యత్వం కూడా రద్దు అవుతుంది. అయితే ప్రజా ప్రతినిధుల చట్టం,1951 ప్రకారం ఇందుకు మూడు నెలలు పడుతుంది. ఈలోగా సంబంధిత వ్యక్తికి శిక్షపై స్టే లభిస్తే కేసు విచారణ ముగిసేంత వరకు అనర్హత విషయంలోనూ చర్యలు తీసుకోరు అని సర్వోన్నత న్యాయస్థానం న్యాయవాది మహేశ్ జఠ్మలానీ అన్నారు. 'దోషిగా రుజువై రెండేళ్ల శిక్ష పడితే అప్పుడు అనర్హతకు అవకాశం ఉంటుంది. అయితే అది వెంటనే జరిగిపోదు. అందుకు మూడు నెలలు పడుతుంది. ఆ లోగా శిక్ష రద్దు అయిత అనర్హత వర్తించదు' అని వెల్లడించారు. ఇలా చేయగలినది అప్పిలేట్ కోర్టు మాత్రమేనని శిక్ష విధించిన కోర్టు కాదని కూడా ఆయన చెప్పారు. అప్పిలేట్ కోర్టు రాహుల్ శిక్షను రద్దు చేయొచ్చన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదించేశారు. 2023-24 బడ్జెట్‌కు ఆమోదం లభించినప్పుడు ప్రధాని మోదీ సభలోనే ఉన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 12 నిమిషాల్లో ముగించేశారు. ఫిబ్రవరి ఒకటో తేదీన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినప్పుడు సీతారామన్ ప్రవేశపెట్టిన పన్ను ప్రతిపాదనలతో కూడిన ఆర్థిక బిల్లు 2023పై శుక్రవారం చర్చ జరిపే అవకాశం ఉంది. బడ్జెట్ సంబంధిత బిల్లులన్నీ రాజ్యసభకు బదిలీ అయ్యాయి. దిగువ సభ ఆమోదం అవసరమైన 'మనీ బిల్లులు'గా వర్గీకరించిన క్రమంలో వాటిపై చర్చలు జరపడం తప్ప రాజ్యసభ ఎలాంటి సవరణలు చేయలేదు. వాస్తవానికి ఏప్రిల్ 6వ తేదీ వరకు సమావేశాలు జరగాలి కానీ బడ్జెట్ సంబంధిత ప్రక్రియ పూర్తి అయిన తర్వాత సమావేశాలనూ ముగించేస్తారన్న సూచనలు ఉన్నాయి. గతంలో వలె ఈసారి పద్దులపై చర్చ జరపలేదు. రైల్వే, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, పంచాయతీ రాజ్, గిరిజన వ్యవహారాలు, పర్యాటకం, సంస్కృతి శాఖల మంత్రిత్వశాఖల చర్చలకు బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఆమోదం తెలిపింది. అయితే సభల్లో ప్రతిష్టంభన కొనసాగిన క్రమంలో దీనిపై చర్చకు అవకాశం రాలేదు. బడ్జెట్ పత్రాల ప్రకారం 2023-24 మొత్తం వ్యయం అంచనా రూ.45,03,097 కోట్లుగా మొత్తం మూలవ్యయం రూ.10,00,961 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈనెల 31తో ముగియనుంది. ఈ ఏడాది వ్యయ అంచనా రూ.41,87,232 కోట్లు కాగా అంతకుముందు సంవత్సరం కంటే ఇది రూ.3,93,431 కోట్లు ఎక్కువ.

'తెలుగు' జడ్జిలు బట్టు, దేవరాజు బదిలీ

న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి చెరొక న్యాయమూర్తిని మద్రాసు హైకోర్టుకు బదిలీ చేస్తూ న్యాయశాఖ గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి దేవరాజు నాగార్జునను మద్రాసు హైకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొంది. అలాగే ఓ జ్యుడిషియరీ అధికారికి అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించినట్లు తెలిపింది. మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా రెండేళ్ల కోసం న్యాయాధికారి పెరియస్వామి వదమలై నియమితులైనట్లు వేరొక నోటిఫికేషన్ పేర్కొంది. ఈయన పేరును సుప్రీంకోర్టు కొలీజియం జనవరిలో సిఫార్సు చేసింది. న్యాయమూర్తులు లేక శాశ్వత జడ్జిలుగా పదోన్నతి కల్పించేందుకు ముందు రెండేళ్లు అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తారు.

పంచుమర్తి అనురాధకు అభినందనలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన టీడీపీ నాయకురాలు పంచుమర్తి అనురాధకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభినందనలు తెలిపారు. జగన్ నియంతృత్వ ధోరణికి అనురాధ గెలుపు గొడ్డలి పెట్టు అని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. తాను తీసుకున్న గోతిలో తానే పడ్డారని జగన్ ఉద్దేశించి అన్నారు. ఎమ్మెల్యేలు విజ్ఞత ప్రదర్శించారని, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ జగన్ అతిజోక్యం, ప్రలోభాలు, బెదిరింపులు, కోట్లాది రూపాయల డబ్బు పంపిణీ చేసినా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను వైసీపీ కోల్పోయిందన్నారు. శాసనమండలినే రద్దు చేయాలనే తీర్మానం చేసిన జగన్‌కు ఇంత దురాశ ఎందుకని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు తగు రీతిలో బుద్ధి చెప్పారని, వైసీపీ పతనం ప్రారంభమైందని రామకృష్ణ పేర్కొన్నారు.

ఆ ఇద్దరెవరు?

(మొదటిపేజీ తరువాయి)

ముందస్తుగానే ఆయా అభ్యర్థులను అప్రమత్తం చేసింది. వారంరోజుల నుంచి పోలింగ్‌పై అవగాహనతో పాటు రెండుసార్లు మాక్ పోలింగ్ నిర్వహించింది. అన్నీ మావే అనే ధీమాతో ఉన్న వైసీపీకి ఈ ఫలితం దిమ్మతిరిగేలా చేసింది. క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఇద్దరినీ గుర్తించామని, సరైన సమయంలో చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ప్రసార మాధ్యమాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఈ వార్తలను ఉండవల్లి శ్రీదేవి తీవ్రంగా ఖండించారు. తాను క్రాస్ ఓటింగ్‌కు పాల్పడలేదని స్పష్టంచేశారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిన సీఎం జగన్ అన్నలాంటి వారని, ఓటేసేముందు తన కుమార్తెతో జగన్‌ను కలిశానని, తనకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్యేపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీలో సంఖ్యాబలం చూస్తే వైసీపీకి 151 మంది ఎమ్మెల్యేలు, టీడీపీకి 23, జనసేనకు ఒకరు ఉన్నారు. ఒక్కో ఎమ్మెల్సీ గెలవడానికి ఎమ్మెల్యే ఓట్లు-22 కావాల్సి ఉంది. వైసీపీ నుంచి ఇద్దరు తిరుగుబాటు ఎమ్మెల్యేలు దూరం కావడంతో ఆ పార్టీ బలం149కి పడింది. జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌తోపాటు టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, మద్దాల గిరి, వాసుపల్లి గణేశ్, కరణం బలరామ్ ఐదుగురి మద్దతుతో వైసీపీ సంఖ్య 154కి చేరింది. టీడీపీకి నలుగురు ఎమ్మెల్యేలు దూరమవ్వడంతో ఆ పార్టీ బలం 19కి పడిపోయింది. కోటంరెడ్డి, ఆనంతో పాటు మరో ఇద్దరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పనట్లు వైసీపీ భావిస్తోంది.

సరైన సమయంలో వేటు: సజ్జల

ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన తమ పార్టీ ఎమ్మెల్యేలను గుర్తించామని, వాళ్ల పేర్లు ఇప్పుడే చెప్పబోమని, సరైన సమయంలో చర్యలుంటాయని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి నొక్కిచెప్పారు. వెంటనే చర్యలు తీసుకోవడానికి ఇది ఉద్యోగం కాదని, రాజకీయమేనని సజ్జల అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం మీడియాతో సజ్జల మాట్లాడుతూ టీడీపీకి తగిన సంఖ్యాబలం లేకపోయినప్పటికీ...ఆ పార్టీ అభ్యర్థిని బరిలోకి దించడంతో వైసీపీ తరపున తమ ప్రయత్నాలు తాము చేశామన్నారు. ఆనం, కోటంరెడ్డిని తాము లెక్కలోకి తీసుకోలేదని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రలోభాలు, కొనుగోలుకు పాల్పడినట్లు ఫలితాలు రుజువు చేస్తున్నాయన్నారు. క్రాస్ ఓటింగ్ కట్టడికి ప్రయత్నించామని, చంద్రబాబు తన నేర్పరితనాన్ని చూపించారన్నారు.

సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సభను విజయవాడ సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 23ఏళ్ల వయస్సులోనే దేశానికి అంతిమ లక్ష్యమని నమ్మి స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన విప్లవ యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని కొనియాడారు.

వీర తెలంగాణ పోరాటం, చల్లపల్లి జమీందారీ, కూలి పోరాటాలు, రైతాంగ పోరాటాలు, సైనికుల పోరాటాలతో సహా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి దేశాన్ని వదిలి వెళ్లకతప్పని పరిస్థితికి తీసుకెళ్ళాయని, ప్రజా పోరాటాలకు ఎదురు లేదని నిరూపించాయని వివరించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ మరణించే కొద్ది సమయం ముందు కూడా భగత్‌సింగ్ లెనిన్ రాసిన రాజ్యం-విప్లవం పుస్తకాన్ని అధ్యయనం చేశారని, ఆ సమయంలోనూ దేశ ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే ఏం చేయాలన్న ఆలోచన తప్ప, తన ప్రాణం గురించి ఆలోచించలేదన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం అధ్యక్షత వహించారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

మార్గదర్శకాల ప్రకారం ఒకేసారి డ్యామ్ అంతా నింపకూడదని, అందువల్ల తొలిదశలో 41.15 మీటర్లకు నిల్వను పరిమితం చేస్తున్నామన్నారు. ఆ మార్గదర్శకాల ప్రకారం మూడు సంవత్సరాలలో నీళ్లు నింపుకుంటూ పోవాలన్నారు. అప్పుడు ఆర్ అండ్ ఆర్ చెల్లించడానికి కొంత సమయం వెసులుబాటు దొరుకుతుందని చెప్పారు. ఇప్పుడు తాము అడుగుతున్న రూ.15వేల కోట్లు పూర్తిగా డ్యామ్ ఎత్తు 45.7 మీటర్లు నిర్మించడానికి సరిపోతుందని, దాంతో పాటు 41.15 మీటర్ల వరకు పూర్తిగా ఎల్‌ఏ, ఆర్ అండ్ ఆర్‌ను కవర్ చేస్తుందన్నారు. దాని తర్వాత కనీసం మూడు సంవత్సరాలు డ్యామ్‌లో నీటిని నింపుకుంటూ...పూర్తి రిజర్వాయర్ స్థాయికి నిల్వ చేసే పరిస్థితి వస్తుందన్నారు. ఆ డబ్బులు కేంద్రం తర్వాత ఇవ్వడానికి వెసులుబాటు ఉంటుందన్నారు.

ఎవరైనా ఇదే పద్ధతిలో చేయాలని, ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా సృష్టిస్తున్న అపోహలను నమ్మొద్దని జగన్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆర్ అండ్ ఆర్, ఎల్ ఏ ఉన్నవాళ్లకు సంబంధించిన వివరాలు ఇస్తామన్నారు. మీరే డీబీటీ మీట నొక్కి నిర్వాసితులకు సాయమందించమని ఇప్పటికే కేంద్రానికి చెప్పామన్నారు. ప్రతి ముంపు కుటుంబానికి రూ.10 లక్షలు ఇస్తానని గతంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానన్నారు. ఆ హామీ ప్రకారం కేబినెట్‌లో తీర్మానం చేసి, జీవో కూడా ఇచ్చామని, 41.15 మీటర్లు వచ్చే లోపు...అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.550 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు.

దానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా చేపడుతుందని, ఇది కేంద్ర ప్రభుత్వం చేయాల్సిన ప్రాజెక్టు అని, దీనికోసం కేంద్రం నిధులిస్తుందని, వాటిని మనం సక్రమంగా వినియోగిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు కోసం మనమే రూ.2600 కోట్లు ఇప్పటికే ఖర్చు పెట్టామన్నారు. ఆ డబ్బులు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాలన్నారు. పనులు ఆగిపోకూడదని, ప్రాజెక్టు నిర్మాణం వేగంగా జరగాలని ఎల్‌ఏ, ఆర్ అండ్ ఆర్ కోసం మన డబ్బులు ఇచ్చామన్నారు.. వాటిని తెచ్చుకోవడం కోసం కేంద్రం చుట్టూ తిరుగుతున్నామన్నారు. కేంద్రం నుంచి నిధులు రావడం ఆలస్యమవుతోందని, అయినా పనులు వేగంగా చేపట్టాలన్న తపన, తాపత్రయంతో రాష్ట్ర ప్రభుత్వమే రూ.2600 కోట్లు ఇచ్చి ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తున్నామని సీఎం వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టును పూర్తి చేసేది తానేనని జగన్ చెప్పుకున్నారు.

న్యాయస్థానాల పరిధిలోనే

(మొదటిపేజీ తరువాయి)

అమరావతిలో ఏపీ హైకోర్టు ఏర్పాటు అయిందని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ఉమ్మడి హైకోర్టుగా ఉన్న అప్పటి హైదరాబాద్ హైకోర్టు, అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ హైకోర్టు అమరావతిలో ఏర్పాటైందన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించేందుకు ప్రతిపాదించారని, మూడు రాజధానుల ప్రతిపాదలను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలైందని కిరణ్ రిజిజు తెలిపారు. మూడు రాజధానుల అంశంపై ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు రాజధాని అమరావతి నగరంలో, పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని చేపట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీని ఆదేశించిందన్నారు. హైకోర్టు తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉందని కిరణ్ రిజిజు తన లిఖితపూర్వక సమాధానంలో వివరించారు.

అనూహ్య ఫలితం

(మొదటిపేజీ తరువాయి)

కొలుసు పార్థసారథి ఉన్నారు. టీడీపీ నుంచి పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 175 మంది ఎమ్మెల్యేలలో 174 మంది ఓటేశారు. వైసీపీ ఎమ్మెల్యే నెల్లిమర్ల అప్పలనాయుడు తన కుమారుడి పెళ్లి ఉండ టంతో మధ్యాహ్నం తర్వాత వచ్చి ఓటేశారు. అప్పలనా యుడు కోసం వైసీపీ అధిష్ఠానం ప్రత్యేక విమానం ఏర్పాటు చేసింది. దాని ద్వారా ఆయన విశాఖపట్నం నుంచి విజయవాడకు చేరుకున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారామ్, హోంమంత్రి తానేటి వనిత, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరు ప్రసాద్‌రాజు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఓట్లు వేశారు. టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, మద్దాల గిరి, వాసుపల్లి గణేశ్, కరణం బలరామ్, వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విశాఖలో కూలిన భవనం

- ముగ్గురి మృతి...ఐదుగురికి గాయాలు
- మృతుల్లో అన్నాచెల్లెలు
- తల్లి పరిస్థితి ఆందోళనకరం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖపట్నంలో విషాదం చోటుచేసుకుంది. భవనం కూలి నిద్రలోనే ముగ్గురు సమిధలయ్యారు. 29వ వార్డు రామజోగిపేటలో మూడంతస్తుల భవనం బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో శిథిలాల కింద చిక్కు కుని ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో అన్నాచెల్లెలు ఉన్నారు. తల్లి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మరో ఐదుగురిని రక్షించి కేజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పురాతన భవనం కూలినట్టు ప్రాథమిక నిర్ధారణలో తేలింది. పక్కనే కొత్త భవన నిర్మాణం జరుగుతుండటం, దానికోసం బోర్ వేయడంతో సమీప భవనం మట్టి కూరుకుపోయి మూడంతస్తుల భవనం కుప్పకూలినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ భవనం 50 ఏళ్ల క్రితం నిర్మించినట్లు తెలుస్తోంది. భవనం కుప్పకూలిన శబ్దాలకు పరిసర ప్రాంత ప్రజల భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, జీవీఎంసీ, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ భవనం మొదటి అంతస్తులో సాకేటి రామారావు, కల్యాణి దంపతులు...వారిద్దరి పిల్లలు దుర్గాప్రసాద్ (17), అంజలి(15) ఉంటున్నారు. అంజలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. ఆమె రామకృష్ణ మిషన్ స్కూల్లో పదో తరగతి చదువుతోంది. తల్లి కల్యాణికి తీవ్ర గాయాలు కావడంతో ఆమెను కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అయితే పిల్లలు మరణించాలన్న వార్త తల్లికి ఇంకా తెలియలేదు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో బీహార్‌కు చెందిన సాహూ(28), విజయవాడకు చెందిన కొమ్మశెట్టి శివశంకర్ (29) నివాసం ఉంటున్నారు. ఈ ఘటనలో సాహూ మృతి చెందాడు. ఇటీవలే వీరిద్దరూ ఆ ఇంట్లో నివాసానికి దిగినట్లు స్థానికులు తెలియజేశారు. నూడిల్స్ దుకాణంలో వీరిద్దరూ పనిచేసుకున్నట్లు తెలిసింది. రెండవ అంతస్తులో సన్నపు కృష్ణ(30), రోజారాణి (29) ఉంటున్నారు. వారు గుమ్మలక్ష్మీపురం ప్రాంతానికి చెందిన వారిగా తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిద్దరూ కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో మొత్తం ఐదుగురు గాయపడ్డారు. వారిలో కొమ్మిశెట్టి శివశంకర్, సాకేటి రామారావు, సాకేటి కల్యాణి, సున్నపు కృష్ణ, రోజా రాణి ఉన్నారు. ప్రమాద సమయంలో భవనంలో మొత్తం 8 మంది ఉన్నారు. సంఘటన స్థలాన్ని నగర మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ రాజబాబు, డీసీపీ సుమిత్ గరుడ పరిశీలించారు. కేజీహెచ్‌లో వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ రాజబాబు వైద్యులతో మాట్లాడి మెరుగైన సేవలు అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

ఇటీవలే వన్‌టౌన్‌లో ఓ ఘటన

ఇటీవలే పాత భవనం కూలిన ఘటన విశాఖ వన్‌టౌన్‌లో చోటుచేసుకుంది. ఆ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. విశాఖ పాత నగరంగా పేరుగాంచిన ఈ ప్రాంతాల్లో పురాతన భవనాలే అధికంగా ఉన్నాయి. మురికివాడల్లో చిన్నచిన్న సందుల్లో నాలుగు అంతస్తుల భవనాలు ఉండటం, పురాతన భవనాలు కావడంతో అనేకచోట్ల ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పుట్టినరోజు నాడే మృత్యువాత

మరో పది రోజుల్లో పదో తరగతి పరీక్షలు రాయాల్సిన అంజలి భవనం కూలి చనిపోయింది. బుధవారం రాత్రి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న అంజలి మరణం అందర్నీ కలచి వేసింది. ఆ ఇంట్లో అన్నాచెల్లెలు మృతి చెందడం, తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడం స్థానికులను కలచివేసింది. అంజలి పుట్టినరోజు వేడుకలను ఉగాది పండగ రోజు జరుపుకున్నారు. బంధువులు, చుట్టుపక్కల వారంతా ఆ వేడుకలకు హాజరయ్యారు. అయితే ఆ ఇంట ఆనందం గంటల్లోనే ఆవిరైపోయింది.

28న దిల్లీలో స్కీమ్ వర్కర్ల మహాధర్నా

జయప్రదం చేయాలని రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: ఈనెల 28న దిల్లీలోని పార్లమెంట్ ఎదుట జరగబోయే స్కీమ్ వర్కర్ల మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవీంద్రనాథ్ మాట్లాడారు. స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని రవీంద్రనాథ్ విమర్శించారు. స్కీమ్ వర్కర్ల సమస్యలపై కొంతకాలంగా ఆందోళనలో చేస్తున్నామని, అయినా వారికి బడ్జెట్‌లో కేటాయింపులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గణనీయంగా తగ్గించాయన్నారు. స్కీమ్ వర్కర్ల విజయవాడ ఆందోళనను జగన్ ప్రభుత్వం అరెస్టులు, గృహనిర్బంధాలతో అణచివేసిందని విమర్శించారు. అయినప్పటికీ వందలాది మంది కార్మికులు విజయవాడ వచ్చి నిరసన తెలిపారని గుర్తుచేశారు. పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని తదితర డిమాండ్లతో దిల్లీలో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఆరు సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్లకు ఒక్క రూపాయి జీతం పెంచలేదన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పీవీఆర్ చౌదరి, ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు కొత్తకోట వెంకటేశ్వర్లు, కె.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానాన్ని

రద్దు చేయాలి

- భగత్ సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి
- భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు చేయాలి: జాన్సన్ బాబు డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజగురు 92వ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు కొత్తపేటలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి గురువారం ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాన్సన్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని, కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాల నుంచి భగత్ సింగ్ చరిత్ర తొలగించిందన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని బీజేపీ పాలిత రాష్ట్రంలో కూడా అమలు చేయడం లేదని, కానీ మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మోదీ మెప్పు కోసమే నూతన జాతీయ విద్యా విధానాన్ని ఈ రాష్ట్రంలో అమలుచేసి విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో 50 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే వాటిని భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులను కలుపుకొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తమ పోరాటాలు ఆగవని, దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే యువత చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞానదీప్, శశి, సాయి, అమరనాథ్, కార్తీక్, ఏఐవైఎఫ్ నగర నాయకులు సుభాని, జానీ, ఖాసీం, రెహమాన్, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పరిశీలనలో దిశ చట్టం

అయినా అమలు చేస్తున్నాం: మంత్రి వనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దిశ చట్టంపై కేంద్రానికి ప్రతిపదనలు పంపామని, చట్టం అమలులోకి రాకపోయినా దాని మార్గదర్శకాలను అమలు చేస్తున్నామని హోంమంత్రి తానేటి వనిత చెప్పారు. శాసనమండలిలో గురువారం టీడీపీ సభ్యులు ఫరూక్, దీపక్‌రెడ్డి, తిరుమల నాయుడు తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి వనిత సమాధానమిచ్చారు. అత్యాచారాలకు పాల్పడే నేరస్తులకు కఠిన శిక్షలు విధించేందుకు, ఇలాంటి కేసులలో 21 రోజుల్లోనే విచారణను వేగంగా పూర్తి చేసేందుకు 2019 డిసెంబర్ 13న శాసనసభ ఈ చట్టాన్ని ఆమోదించిందన్నారు. ఆమోదం కోసం దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపగా, అక్కడ పరిశీలనలో ఉందన్నారు.

ధాన్యం సేకరణలో దళారులకు అడ్డుకట్ట: మంత్రి కారుమూరి

వరి సేకరణ విషయంలో మధ్యవర్తులను నివారించేందుకుగాను రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామని, గ్రామ వ్యవసాయ సహాయకులను ఆ కేంద్రాలకు ఇన్‌ఛార్జ్‌లుగా నియమించామని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ధాన్యం సేకరణలో దళారులకు అడ్డుకట్ట వేయడంపై సభ్యులు తోట త్రిమూర్తులు, దేవసాని చిన్న గోవిందరెడ్డి, పండుల రవీంద్రబాబు తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. వరి విస్తీర్ణం, పండించిన పంట, ఆశించిన దిగుబడితోపాటు ఆర్బీకేల వద్ద రైతుల వివరాలు నమోదు చేస్తున్నారని, ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాను ఈ క్రాప్ పోర్టల్లో నమోదు చేశామని, వరి సేకరణ ప్రక్రియలో రైస్ మిల్లర్లు, ఏజెంట్లు, మధ్యవర్తులు లేకుండా నేరుగా రైతులకు చెల్లింపులు చేస్తున్నామన్నారు.

వైద్యశాఖలో 16 పోస్టుల భర్తీకి చర్యలు: మంత్రి విడదల రజని

వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 16 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి విడదల రజని వెల్లడించారు. జమ్మలమడుగు ప్రభుత్వ వైద్యశాలలో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడం జరిగిందా?, వైద్యశాలలో సరిపడా వైద్యులు, ప్రసూతి వైద్యనిపుణులు, స్టాఫ్‌నర్స్, పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో ఉన్నారా? వైద్యశాలలో ఖాళీగా ఉన్న 16 పోస్టులను భర్తీ చేయడానికి, ఆసుపత్రిని సమర్థవంతంగా నిర్వహించుటకు ప్రభుత్వం తీసుకున్న చర్యల'పై సభ్యులు శివనాథరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. జమ్మలమడుగులో ఉన్న 50 పడకల పీహెచ్‌సీని వంద పడకల స్థాయికి పెంచామన్నారు. అదనపు వసతులు కల్పించడం కోసం నాబార్డు కింద రూ.14.5 కోట్లు మంజూరు చేశామని, ఆసుపత్రి అవసరాల కోసం ప్రస్తుతం ఉన్న 1.15 ఎకరాల స్థలం సరిపోవడం లేదన్నారు. మంజూరైన 23 పోస్టులకుగాను 14 మంది వైద్యులు అందుబాటులో ఉన్నారని, మంజూరైన 24 స్టాఫ్‌నర్సుల పోస్టులకు 23 మంది అందుబాటులో ఉన్నారని వివరించారు. మత్స్యకారుల సంక్షేమంపై సభ్యులు డాక్టర్ పండుల రవీంద్రబాబు, తోట త్రిమూర్తులు తదితరులు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సమాధానమిచ్చారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద చేపలవేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ.10వేల చొప్పున అందజేస్తున్నామన్నారు.

భగత్ సింగ్ ఆదర్శం

యువతకు ఈశ్వరయ్య, రాజేంద్ర పిలుపు

విశాలాంధ్ర-వినుకొండ: దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసమస్యల పరిష్కారానికి యువత పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య , అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ వినుకొండ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఈశ్వరయ్య మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ పోరాట, జీవిత చరిత్రను వివరించారు. జైళ్లను, లాఠీలను, తూటాలను, ఉరికంబాలను చిరునవ్వులతో ముద్దాడిన సర్దార్ భగత్ సింగ్ విప్లవ ధ్రువతారని కొనియాడారు. బ్రిటిష్ పాలన పోవడమే కాదు ఒక మనిషిని వేరొక మనిషి దోచుకొనుటకు వీలులేని న్యాయ సమ్మతమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థ కావాలని భగత్ సింగ్, ఆయన అనుచరులు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని, బ్రిటిష్ సామ్రాజ్య వాదులు అంతర్జాతీయ నియమాలను తుంగలో తొక్కి విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవులను ఉరితీశారని చెప్పారు. యువతలో చైతన్య స్ఫూర్తి నింపి, స్వాతంత్రం పోరాటంలో యువతను భాగస్వామ్యం చేయడంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ప్రధాన పాత్ర పోషించారని ఈశ్వరయ్య తెలిపారు. పరుచూరి రాజేంద్ర బాబు మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిస్తూ వారి ఆశయాలకు తూట్లు పొడిచే వారిపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను వక్రీకరించేందుకు ప్రయత్నిస్తోందని, దీనిని ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న నరేంద్ర మోదీ ఇవ్వకపోగా, ఉన్న ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటీకరిస్తూ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారన్నారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ. మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్క విద్యార్థి,యువత పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏరియా కార్యదర్శి భూదాల శ్రీనివాస రావు కూడా మాట్లాడారు. స్థానిక బస్టాండ్ వద్ద నుంచి ప్రారంభమైన కాగడాల ప్రదర్శన శివయ్య స్థూపం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ, ఏఐవైఎఫ్ నాయకులు బుదాల సాగర్ బాబు, ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి శశి,మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

అక్కినేని వనజ పిలుపు

విశాలాంధ్ర-నందిగామ: నాడు బ్రిటీషు పరాయి పాలకుల నుంచి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమర యోధులు సర్దార్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ పోరాట స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ 92వ వర్ధంతి కార్యక్రమం సీపీఐ, ఏఐవైఎఫ్ అధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా నందిగామలో నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి గాంధీ సెంటర్ భగత్ సింగ్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ముగాస్తూ సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి నిరంకుశ విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని జీవో నెంబర్ ఒకటి లాంటి చట్టాలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. అమర వీరుల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ అపోలో విద్యాసంస్థల అధినేత కాపా రవీంద్రనాథ్, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి అధ్యక్షులు పి చంద్రానాయక్, ఆర్.పిచ్చయ్య, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరుమామిళ్ల చైతన్య కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు, మన్నెం నారాయణరావు, మాజీ విద్యార్థి నాయకులు బాజి, పొల్నిడి నాగ భూషణం, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్ట చామంతి, పట్టణ కార్యదర్శి వేముల వీరయ్య, ఏఐవైఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మన్నే హను మంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మౌలాలి, నాగరాజు పాల్గొన్నారు.

సింహాచలం భూ సమస్యలకు సలహా కమిటీ

దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సింహాచలం దేవస్థానం-పంచ గ్రామాల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం ఒక సలహా కమిటీని ఏర్పాటు చేసిందని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఈ కమిటీ నివేదిక వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాసనమండలిలో సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, పీవీఎన్ మాధవ్ తదితర సభ్యులు మాట్లాడుతూ సింహాచల దేవస్థానం పరిధిలోని పంచ గ్రామాల భూ సమస్యకు ప్రభుత్వం ఏదైనా పరిష్కారం కనుగొన్నదా? అన్న ప్రశ్నకు సింహాచలం-పంచ గ్రామాల భూ సమస్యలపై సభ్యులు సూచించిన అంశాలను పరిశీలించి, వాటిపై దృష్టి కేంద్రీకరిస్తామని మంత్రి సమాధానమిచ్చారు.

ది ముంబై ఆంధ్ర మహాసభ ఉగాది వేడుకలను ముంబైలో జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించిన హాస్యబ్రహ్మ శంకర నారాయణ, మహాసభ అధ్యక్షులు సంకు సుధాకర్, ధర్మకర్తల మండలి చైర్మన్ భోగ సహదేవుడు తదితరులు

కేంద్రం నిధులు పంచాయతీలకు సర్దుబాటు

ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వ నిధులను గ్రామ పంచాయతీలకు సర్దుబాటు చేస్తున్నామని, ఇతర అవసరాలకు మళ్లించలేదని ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్) మూడి ముత్యాలనాయుడు చెప్పారు. సభ్యులు దువ్వారపు రామారావు, తిరుమల నాయుడు, అశోక్ బాబు, ఫారూఖ్, ప్రభాకర్, రాజసింహులు, దీపక్‌రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానమిచ్చారు. విద్యుత్ బిల్లులు మొదలైన వాటిని చెల్లించేం దుకు గ్రామపంచాయతీల అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్ర నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ చేయూత పథకం ప్రధాన లక్ష్యం, లబ్ధిదారుల సంఖ్య, ఖర్చు వివరాలపై సభ్యులు వరుదు కళ్యాణి, పోతుల సునీత తదితరుల ప్రశ్నలకు మంత్రి స్పందిస్తూ 45-60 ఏళ్ల వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల మహిళలకు నాలుగు దశల్లో రూ.75 వేల ఆర్థిక సహాయం అందించడం వైఎస్ఆర్ చేయూత ప్రధాన ఉద్దేశంగా తెలిపారు. జవనోపాధి అవకాశాలు, ఆదాయ ఉత్పత్తి, సంపద సృష్టి లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. 2019-20లో ఈ పథకం ప్రారంభం కాలేదని, 2020-21లో 24,00,111 మందికి రూ.4500.21 కోట్లు, 2021-22లో 24,95,714 మందికి రూ.4679.46 కోట్లు, 2022-23లో 26,39,703 మందికి రూ.4949.44 కోట్లు వెరసి 14,129.11 కోట్లు ఈ పథకం కింద ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

భగత్‌సింగ్ దారిలో యువత

లెనిన్‌బాబు ఆకాంక్ష

విశాలాంధ్ర - కృష్ణగిరి: భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు పోరాట స్ఫూర్తితో నేటి యువత విద్య ఉపాధి హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలని అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎన్. లెనిన్‌బాబు పిలుపు నిచ్చారు. కర్నూలు జిల్లా కటారు కొండ గ్రామంలో భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 92వ వర్ధంతి సందర్భంగా గురువారం చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. యువతకు వారు ఆదర్శమన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న నేప థ్యంలో ఉపాధి లేక నిరుద్యోగం పెరుగుతోందన్నారు. సీపీఐ మండల కార్య దర్శి ఖలీల్ బాషా, కటారు కొండ గ్రామ సహాయ కార్యదర్శి ఆర్.బి చిన్న మాదులు, గ్రామ యువకులు నక్కీ హర్షవర్ధన్, హరిజన నాగరాజు, గొల్ల రామాంజ నేయులు, హరిజన గోపాల్, బోయిని కవీంద్రనాథ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీపీఐపై అసత్య ప్రచారాన్ని సహించం

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- విశాఖ పోలీసులకు నేతల ఫిర్యాదు

విశాలాంధ్ర - విశాఖ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)పై ఫేస్‌బుక్ మాధ్యమంగా జరుగుతున్న అసత్య ప్రచారాన్ని పార్టీ విశాఖ జిల్లా నేతలు తీవ్రంగా పరిగణించారు. దీనిపై విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధర్మ ధ్వజం హిందూ చైతన్య వేదిక అనే పేరుతో ఉన్న ఫేస్‌బుక్ పేజీలో సీపీఐని ప్రపంచ ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చిన రాజకీయ పార్టీగా ప్రచారం చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. తమ వాదనకు బలం చేకూర్చేందుకు ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ సంస్థ విడుదల చేసిన గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్-2023 నివేదికను ఆ సంస్థ ఆధారంగా చూపిందని, అసలు నివేదికలో 14 పేజీలు ఉంటే ఈ సంస్థ ఫేస్‌బుక్‌లో ప్రచారం కోసం వాడిన దాంట్లో 95 పేజీలు ఉన్నాయన్నారు. ఘన చరిత్ర కలిగిన బాధ్యతాయుత పార్టీపై ఉద్దేశపూర్వకంగా సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేసిన ఆ ఫేస్‌బుక్ పేజీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ నగర పోలీసు కమిషనరేట్‌కు సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరిపెల్ల పైడిరాజు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ విమల, కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు వై రాంబాబు, యు నాగరాజు, ఎన్ అప్పన్న ఉన్నారు. అంతకుముందు పైడిరాజు మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామం మొదలుకొని ఇప్పటి వరకు దేశ రాజకీయ అవనికలో సీపీఐ కీలకపాత్ర పోషించిందని, నేడున్న పార్లమెంట్ భవనం మాజీ ఎంపీ పి.రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారని గుర్తుచేశారు. నాటి నాయకులు భూపేష్ గుప్తా, సుందరయ్య, రేణు చక్రవర్తి, గీతాముఖర్జీ, పార్వతి కృష్ణన్, గురుదాస్ దాస్ గుప్తాతో పాటు నేడున్న సుధాకర్ రెడ్డి, డి.రాజా, వినయ్ విశ్వం పార్లమెంటులో ప్రజా సమస్యలపై పోరాడుతున్నట్లు తెలిపారు. నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పి.ఇంద్రజిత్ గుప్తా (సీపీఐ ఎంపీ) వ్యవహరించారని గుర్తుచేశారు.

సంపాదకీయం

అందివచ్చిన అవకాశం

దేశంలో ప్రజాస్వామ్యం మంటగలుస్తోంది అని లండన్‌లో రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం దేశాన్ని అవమానించడమే కనక ఆయనను లోకసభ నుంచి బహిష్కరించాలన్న అధికార పక్షమైన బీజేపీ సంకల్పం ఇంకా నెరవేర లేదు. అలాగే తాను లండన్‌లో చేసిన వ్యాఖ్యల మీద పార్లమెంటులోనే సమాధానం చెప్పాలన్న రాహుల్ ప్రయత్నమూ ఫలించలేదు. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీని దర్యాప్తు సంస్థ 50 గంటలు ప్రశ్నించినా ఆ అంశంలో రాహుల్ పై ఇప్పటికీ ఏ కేసు దాఖలు కాలేదు. ఆయన ఇంటి దగ్గర రెండు రోజుల కిందే పోలీసులు మోహరించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా కొంతమంది మహిళలు చేసిన ఫిర్యాదు గురించి రాహుల్ మాట్లాడినందుకు పోలీసులు మోహరించారు. తాజాగా సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మోదీ పేరుగల వారి మీద రాహుల్ గాంధీ 2019వ్యాఖ్యలు చేసినందుకు సూరత్ లోని ప్రధాన మేజిస్ట్రేట్ కోర్టు ఆయనకు రెండేళ్ల శిక్ష విధించింది. అయితే ఆయన పైకోర్టులో అప్పీలు చేసుకోవడానికి వీలుగా నెల రోజుల గడువిచ్చింది. ఆయనకు బెయిలు కూడా మంజూరు చేసింది. రాహుల్ గాంధీ పై కోర్టుకు వెళ్లి, ఆ కోర్టు విచారణ పూర్తి అయి ఆ కోర్టులోనూ ఇలాంటి తీర్పేవస్తే న్యాయపరంగా ఉన్న అవకాశాలు మూసుకుపోతే రాహుల్ గాంధీ జైలుకెళ్లాల్సి రావచ్చు. ఒక వేళ ఈ శిక్ష అనుభవించవలసివస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు అవుతుంది. ఆరేళ్ల పాటు ఆయన పోటీ చేయడానికి వీలుండదు. అయితే అత్యుత్సాహపరుడు, సామాజిక కార్యకర్త, సుప్రీంకోర్టు న్యాయవాది అయిన వినీత్ జిందాల్ రాహుల్‌ను అనర్హుడిగా ప్రకటించాలని లోకసభ స్పీకర్‌కు విజ్ఞప్తి చేసేశారు. 2019 ఎన్నికల సందర్భంగా కర్నాటకలోని కోలార్ లో రాఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో అవినీతి గురించి మాట్లాడుతూ "నీరవ్ మోదీ, లలిత్ మోదీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ – ఇలా మోదీ ఇంటిపేరున్న వారందరూ దొంగలుగా ఎందుకుంటారని నా అనుమానం" అని రాహుల్ అన్నారు. ఈ విషయంలో ఆయన మీద గుజరాత్ లోని సూరత్ లో కేసు దాఖలైంది. సూరత్ ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హెచ్. హెచ్. వర్మ నాలుగు రోజుల కింద ఈ కేసులో విచారణ ముగించి గురువారం రాహుల్‌కు రెండేళ్ల శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. రాహుల్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పిన సమయంలో మేజిస్ట్రేట్ హెచ్.హెచ్. వర్మ చేసిన వ్యాఖ్యలు కూడా గమనించదగినవే. ఆయన ప్రధానంగా మూడు వ్యాఖ్యలు చేశారు. ఒకటి: సుప్రీంకోర్టు హితవు చెప్పినప్పటికీ రాహుల్ ప్రవర్తనలో మార్పు లేదు. రెండు: నిందితుడు పార్లమెంటు సభ్యుడు కనక ఆయన ప్రజలతో మాట్లాడేటప్పుడు ఆ హోదాలోనే మాట్లాడతారు కనక ఆ ప్రభావం ప్రజల మీద ఉంటుంది. అందువల్ల ఆయన ఇతరులను అవమానించేలా మాట్లాడితే ఆ ప్రభావం నిశ్చితంగా ఉంటుంది. మూడు: ఇలాంటి పలుకుబడి గల వ్యక్తులకు తక్కువ మోతాదు శిక్ష విధిస్తే సమాజానికి తప్పుడు సందేశం అందుతుంది అన్నారు. ఆ కేసులో చాలా కాలం విచారణ ఆగిపోయింది. తరవాత హై కోర్టు నుంచి విచారణకు అనుమతి లభించింది.

సదరు కోర్టు కేవలం 20 నిమిషాలలోనే విచారణ పూర్తి చేసి రాహుల్ కు రెండేళ్ల శిక్ష విధించేసింది. సత్వర న్యాయం అంటే ఇదే కాబోలు. ఇది పరువునష్టం కేసు. ఇలాంటి కేసుల్లో అత్యధికంగా రెండేళ్ల జైలు శిక్ష మాత్రమే విధించవచ్చు. విచారణ జరిపిన న్యాయమూర్తి అత్యధిక శిక్ష విధించారు. అంతకన్నా ఎక్కువ శిక్ష విధించడానికి ఆయనకు అవకాశం లేదు మరి! అప్పీలు చేసుకోవడానికి శిక్ష విధించిన కోర్టు గడువు ఇచ్చింది కనక ఆ లోగా లోకసభ సభ్యుడిగా అనర్హుడయ్యే ప్రమాదం రాహుల్ గాంధీకి ఏమీ లేదు. ఈ అంశం మీద పై కోర్టుకు వెళ్లి పోరాడతామని కాంగ్రెస్ నాయకులు చెప్తున్నారు. 2019లో కర్నాటకలో మాట్లాడుతూ మోదీ అన్న పేరు ఉన్న వారందరూ దొంగలే అని రాహుల్ గాంధీ అనడంపై సూరత్ శాసన సభ్యుడు పూర్ణేశ్ మోదీ కేసు దాఖలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు మోదీ వర్గం అంతటినీ అవమానించేలా ఉన్నాయని ఆయన వాదించారు. పూర్ణేశ్ ఒకప్పుడు గుజరాత్ లో మంత్రిగా కూడా ఉన్నారు. గత డిసెంబర్ లో జరిగిన ఎన్నికలలోనూ ఆయన సూరత్ నుంచి మళ్లీ ఎన్నికయ్యారు.

ఈ కేసులో సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తుతానికి తప్పు పట్టలేం. ఆ తీర్పులోని ఉచితానుచితాలపై కోర్టులో మాత్రమే తేలాలి. రాహుల్ గాంధీని ఏదో ఒక రకంగా భయపెట్టి, బెదిరించి తమదే పై చేయి అని నిరూపించుకోవడానికి బీజేపీ అగ్ర నాయకత్వం సకల ప్రయత్నాలూ చేస్తోంది. రాహుల్ గాంధీని చూస్తే పాలకపక్షానికి ఒక రకమైన భయం ఆవహించిందేమోనన్న అనుమానం కలుగుతోంది. మరోకోణం నుంచి చూస్తే ఏ రకమైన విమర్శలను సహించే లక్షణం అధికార పక్షానికి లేదు అని అడుగడుగునా రుజువు అవుతూనే ఉంది. మేజిస్ట్రేట్ వర్మ ఇచ్చిన తీర్పులో లోపాలు ఎన్నడం ఉన్నత న్యాయస్థానం మాత్రమే చేయగలిగిన పని. అయితే రెండేళ్ల అత్యధిక శిక్ష విధించడం మాత్రం ఆ మేజిస్ట్రేట్ విచక్షణకు సంబంధించిందే. ఈ కేసులో తీర్పు రావడమే ఆలస్యం బీజేపీ నాయకులు, భక్తులు చాలా క్రియాశీలురు అయిపోయారు. రాహుల్ గాంధీ మీద ఏదో ఓ చర్య తీసుకోవాలని ఆక్రోశిస్తున్నారు. ఈ ధోరణి దేశంలో నానాటికీ ఇతరుల మాటను వినిపించుకునే తత్వం తగ్గుతున్న వాస్తవానికి సంకేతం. గత కొన్నేళ్లుగా పెంచి పోషిస్తున్న విద్వేష ప్రచార ఫలితం ఇలాగే ఉండక తప్పదు. విద్వేషం అన్నమాట కేవలం ముస్లింలకు మాత్రమే వర్తించేది కాదు. అధికార పక్షాన్ని, ఆ పక్షం నాయకుడిని పల్లెత్తు మాట అన్నా సహించే స్వభావం బీజేపీ భక్తుల్లో మాయమై పోతోంది. ఇప్పటికి అందిన సమాచారం ప్రకారం రాహుల్ గాంధీ పార్లమెంటు సమావేశాలకు దూరంగా ఉంటారనిపిస్తోంది. అంటే ప్రధాన ప్రత్యర్థి లేనందువల్ల అధికార పక్షం సంతృప్తి పడుతుందేమో చూడాలి. రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న ఏ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండానే ఈ పార్లమెంటు సమావేశాలు ముగించాలన్న అధికారపక్ష వ్యూహానికి రాహుల్‌పై కోర్టు తీర్పు కూడా పరోక్షంగానైనా ఉపకరిస్తుందేమో! కొసమెరుపు ఏమిటంటే కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో రాహుల్ గాంధీ ప్రసంగంపై కేసు నమోదు చేయాలని ఓ బీజేపీ నాయకుడు పెట్టుకున్న అర్జీని వారణాసి కోర్టు తోసిపుచ్చింది.

న్యాయం జాడ ఎక్కడ

రా బావ ఏంటి చిరాగ్గా గొనుక్కుంటూ వస్తున్నావు. ఆ ఏముంది రోజూ ఉండే భారతమే. గతంలో ఒక పెద్దాయన వింటే భారతమే వినాలి తింటే గారెలే తినాలి అన్నాడు. కాని నేనైతే వింటే ప్రస్తుత పాలన గురించే వినాలి తింటే విషంతో కూడుకున్న ప్రస్తుత ఆహారమే తినాలి. అసలేం జరిగిందయ్యా.. ఏం జరగాలి రోజూ పత్రికలలో చూస్తున్న భాగోతమే. అది సరే ఈ రోజు ఏం చూశావు. ఏంటి చూసేది. నీకేంటి సహజ విశ్లేషకుడి విజ్ఞానసంపద కలవాడినని ఇంట్లో కూర్చుంటావు. నీ కేమో అన్నీ కనపడవు వార్తా పత్రికలలో వచ్చినవే నీకు తెలుసు. అసలు ఆ పత్రికలు అమ్ముడుపోయి నిజాలు కప్పిపెట్టి అవాస్తవాలు రాస్తారన్న సంగతైనా తెలుసా. అది సరే ఈ రోజు ఏం చూశావ్ అలా తాపీగా అడుగు. బైటకొస్తే చూసేవన్నీ ఘోరాలే. ప్రస్తుతం సమాజంలో మనసున్న మనిషి ఒక్కడైనా ఉన్నాడా అని. వికలాంగులు, బధిరులు అని చిన్నచూపు చూసే వారేగానీ, వారిని అక్కున చేర్చుకుని వారికి సహాయపడే వాడున్నాడా. నేను నీ దగ్గరికి వచ్చేటప్పుడు ఒక గుడ్డివాడు రోడ్డు పక్కన కూర్చుని అడుక్కుంటున్నాడు. ఒక వ్యక్తి చూడడడానికి మంచి బట్టలు, విలువైన కళ్లజోడు, మంచి బూట్లు వేసుకుని వెడుతూ ఆ గుడ్డివాని దగ్గరాగి అందులో ఒక రూపాయి వేసి ఎవరో పుణ్యాత్ముడు వేసిన



వందనోటు తీసుకొని వడివడిగా పోతుంటే పట్టుకున్నా. పదిమంది చేరి ఆయన దర్పం, దర్జా చూసి భలేవాడిని పట్టుకున్నావయ్యా వదిలేయమని నాపై ధ్వజమెత్తారు. ఎంతో మంది దివ్యాంగులు ఎటువంటి ఆదరణకు నోచుకోక బాధపడుతున్నారు.

అటువంటి వారికి సహాయం చేయకపోగా హేళనచేసేవాడిని కళ్లున్న కబోది అంటారు. అసలు సమాజం కుళ్లిపోయింది. మనసున్న మనిషే కరువయ్యారు. నిజమేనయ్యా కోట్లు కొల్లగొడుతూ అధికారంతో వెలిగిపోయేవాళ్లు పెద్దమనుషులుగా చెలామణి అవుతున్నారు. నిజమే బావ అంతెందుకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో నేరం చేసిన అదాని విషయంపై చర్చకు అవకాశం ఇవ్వకుండా రాహుల్‌గాంధి దేశాన్ని అప్రతిష్టపాలు చేశాడని బుకాయిస్తున్నారు. అదాని విషయంపై చర్చకు అనుమతిస్తే ప్రధాని మోదీ గుట్టు బైటపడుతుందని భయం. అంతెందుకు న్యాయం కోసం పోరాడే వామపక్షాలు, కొంతమంది ప్రజాస్వామ్యవాదులు రోడ్డునపడి లాఠీ దెబ్బలు తిని జైలుపాలవుతున్నారే తప్ప ఎవరూ పట్టించుకోవడంలేదు. అంతెందుకు ప్రత్యేక హోదా అవసరమని అందరూ గొంతుచించుకున్నారు. చంద్రబాబు లెక్కలు చెప్పనవసరంలేదని ప్యాకేజీకి ఒప్పుకుంటే ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ కేసులకు జడిసి మెత్తబడ్డాడు. మధ్యలో నష్టపోయింది ప్రజలు. అందరూ కల్సిపోరాడే పరిస్థితి కనబడటంలేదు. అధికార, ప్రతిపక్షాల వైఖరితో ప్రజలు నష్టపోతున్నారు. నాయకులు చేసే తప్పులు ప్రజలకు శాపాలుగా మారుతున్నాయి. నిజమే బావ కుటుంబానికి 15లక్షలు పంచుతానని ఊరించిన మోది ఆమాట మరచి పెద్ద నోట్ల రద్దుతో హీరో అవుదామనుకుంటే అందులోని డొల్లతనం రిజర్వుబ్యాంకు బైటపెట్టడంతో మోదీ నోరు మూతపడింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మంత్రులు, శాసనసభ్యులు అవినీతికూపంలో కూరుకుపోయి సిగ్గువిడచి తమది అవినీతి రహిత ప్రభుత్వంగా చెప్పుకోవడం చూచి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మేధావులు నవ్వుకుంటున్నారు. చూడలేక కలం పట్టిన రచయితలను, మేధావులను హత్యచేసినవారిపై చర్యలు తీసుకోకుండా అది అమానుషం అని చిలకపలుకులు పలికే మోదీ అంతరంగం తెలియకకాదు. నిజమే చదువుకున్న చదువు డబ్బుతో కొనుక్కున్న పదవి ఉపయోగించి సామాన్య ప్రజల్ని ప్రలోభాలలో ముంచి మూఢనమ్మకాలతో ఆటాడుకోవడం నాయకులకు పరిపాటిగా మారింది బావ. మద్యనిషేధం విధించకుండా మద్యం తాగించి ఆసుపత్రిలో ఉచిత వైద్యం చేయించడంలోని ఔచిత్యం తెలియనిదికాదు. ప్రతిదీ తాత్కాలిక ఉపశమనమేగాని ప్రతి సమస్యను కూలంకషంగా పరిశీలించి శాశ్వత పరిష్కారంవైపు ఏ ప్రభుత్వం ఆలోచించడంలేదు. విద్య, వైద్యం ప్రతి మనిషికి ఉచితంగా అందించడం గొప్ప విషయం మాత్రమే కాదు, దినితో పాటు ప్రతి మనిషిని మూఢనమ్మకాల నుండి బైటపడే విద్య బోధిస్తే సమాజం మార్పుకు దోహదపడుతుంది. ఆ విషయంపై ప్రభుత్వాలు దృష్టిపెట్టకపోతే మోసగాళ్ల చేతిలో పేదలు మోసపోతూనే ఉంటారు. వాళ్ల దరిద్రానికి శాశ్వత పరిష్కారం లభించదు.

ఒక పక్క వాతావరణ కాలుష్యంతో పీల్చేగాలిలో దాదాపు 30శాతం విషవాయువులున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంకో 50ఏళ్లలో వాటిని నియంత్రించకపోతే యుద్ధాలు, బాంబులు, అవసరంలేదు. పీల్చే గాలి వల్లనే మరణం ఖాయం. అసలు మూలాల్లోకి వెళ్లి శాశ్వత పరిష్కారంవైపు ఏ ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. ఈ స్థితిలో ఇంటికే పరిమితమైన రచయితలు, మేధావులు బైటపడి శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వాలకు సూచనలిచ్చి అవసరమైతే రోడ్డెక్కకపోతే ఈ సమాజం సర్వనాశనంకాక తప్పదు. అందుకు కళాకారులను ఉపయోగించుకొని ప్రజల్లో చైతన్యం కలిగించి వీధిపోరాటాలకు సమాయత్తం చేయాలి. అప్పటివరకు న్యాయం జరగదు సరికదా దాని అడ్రసు తెలియదు.

సెల్: 9885569394

నల్లధనం-కుంభకోణాల భారత్!

ఆసియాలోనే అత్యంత అవినీతి దేశంగా భారత్ నిలిచింది. 69శాతం అవినీతితో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత 65శాతంతో వియత్నాం ఉంది. భారతదేశంలో ప్రతి పదిమందిలో ఏడుగురు ఏదో ఒక సందర్భంలో అవినీతికి పాల్పడ్డారని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న పౌరసమాజ సంస్థ ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నిర్వహించిన తాజా సర్వేల్లో వెలుగు చూశాయి. నల్లధనం జాతీయఉత్పత్తిలో (జీడీపీ) 18శాతం నుంచి 20శాతం వరకు ఉంది. ప్రతి రోజు 240 కోట్ల రూపాయలు దేశం సరిహద్దులు దాటి పోతున్నాయి. 1948-2008 మధ్యకాలంలో 46,200 కోట్ల డాలర్ల సొమ్ము విదేశాలకు తరలిపోయింది. స్విస్‌బ్యాంక్‌లో 89లక్షల కోట్ల భారతదేశ డబ్బులు మూలుగుతున్నాయి. ఈ నల్లధనం 100లక్షల కోట్లకు పైగా ఉందని కొన్ని నివేదికలు వెల్లడించాయి.

పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ విధానాలు ఏ వర్గాల ప్రయోజనాలు కాపాడుతున్నాయన్న దానిపై ఆ దేశ ఆర్థిక విధానాలతో పాటు, సంపద కేంద్రీకరణ, వికేంద్రీకరణ, అవినీతి,నల్లధనం వెల్లడౌతుంది. తొలినుంచి ప్రభుత్వాలన్నీ భూస్వాముల, బడా పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు కాపాడే విధానాలు అమలు జరుపుతున్నందున ఆర్థికవ్యవస్థ అవినీతికి, భారీ కుంభకోణాలకు నిలయంగా మారింది. ఫలితంగా ఒకవైపు సంపద పోగుపడటం, మరోపక్క దారిద్ర్యం సమానాంతరంగా కొనసాగుతున్నది. దేశంలో వందమంది కుబేరులు ఉంటే, 23.6 బిలియన్ డాలర్లతో ముఖేశ్ అంబాని మొదటి స్థానంలో ఉన్నాడు. ఒక శాతం అతి ధనవంతులు 90శాతంపైగా దేశ సంపద కలిగి ఉన్నారు. మిగిలిన వారందరూ 10శాతం మాత్రమే కలిగి ఉన్నారు. 2014 ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకివస్తే అవినీతిరహిత పాలనతోపాటు, వందరోజుల్లో విదేశాల్లో మూలుగుతున్న నల్లడబ్బు దేశానికి రప్పించి ప్రతివ్యక్తికి 15లక్షల రూపాయలు ఇస్తానని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లధనాన్ని వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని మోదీ ప్రభుత్వం నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. ఈ బృందం ఏమిచేస్తున్నదీ, ఏమి చేసింది మోదీకి మాత్రమే తెలుసు. దర్యాప్తుబృందం గురించి, నల్లడబ్బు గురించి నేడు మోదీ ప్రభుత్వం ఎందుకుమౌనం వహిస్తున్నది. నల్లధనం యదేచ్ఛగా విదేశాలకు తరలి పోతున్నా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదు.

ఆసియాలోనే అత్యంత అవినీతి దేశంగా భారత్ నిలిచింది. 69శాతం అవినీతితో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత 65శాతంతో వియత్నాం ఉంది. భారతదేశంలో ప్రతి పదిమందిలో ఏడుగురు ఏదో ఒక సందర్భంలో అవినీతికి పాల్పడ్డారని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న పౌరసమాజ సంస్థ ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నిర్వహించిన తాజా సర్వేల్లో వెలుగు చూశాయి. నల్లధనం జాతీయఉత్పత్తిలో(జీడీపీ) 18శాతం నుంచి 20శాతం వరకు ఉంది. ప్రతి రోజు 240 కోట్ల రూపాయలు దేశం సరిహద్దులు దాటి పోతున్నాయి. 1948–2008 మధ్యకాలంలో 46,200 కోట్ల డాలర్ల సొమ్ము విదేశాలకు తరలిపోయింది. స్విస్‌బ్యాంక్‌లో 89లక్షల కోట్ల భారతదేశ డబ్బులు మూలుగుతున్నాయి. ఈ నల్లధనం 100లక్షల కోట్లకు పైగా ఉందని కొన్ని నివేదికలు వెల్లడించాయి.

దేశంలో నల్లధనం కథ ఇప్పటిది కాదు. జాతీయోద్యమకాలంలోనే నల్లధనం పోగడటం ప్రారంభమైంది. 1955లో నికోలాస్ కల్టోర్ జరిపిన పరిశోధనలో 600కోట్ల నల్లధనం ఉన్నట్లు తేలింది. ఇది ఆనాటి దేశ స్థూలఉత్పత్తిలో 4.5శాతంగా ఉంది. 1969లో జస్టిస్ వాంచూ కమిటీ పన్నులవిధానంపై సూచనలుచేస్తూ పోగుబడిన నల్లధనం 7వేల కోట్లని చెప్పింది. 1980–81లో రాజ చల్లయ్య నేతృత్వంలోని పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ ప్రకారం పోగైన నల్లధనం 15లక్షల కోట్లు. ఇది జీడీపీలో 20శాతం. 1992లో ఎస్‌బి గుప్తా పరిశీలన ప్రకారం అది 42శాతం. 1987–88లో జీడీపీలో నల్లధనం 51శాతంగా నమోదైంది. జవహర్‌లాల్ విశ్వవిద్యాలయం ఆర్థికశాఖ ప్రొఫెసర్ అరుణ కుమార్ 2005–06లో రాసిన బ్లాక్ ఎకానమీ ఇన్ ఇండియా అనే పుస్తకంలో జీడీపీలో 50శాతం ఉన్న నల్లధనం విలువ 39 లక్షల కోట్లుగా పేర్కొంది. ఒక్క 2012 సంవత్సరంలోనే 95 బిలియన్ డాలర్లు (6లక్షల కోట్లు) ధనం దేశంనుంచి దాటించడమైంది. ఇది 2022 సంవత్సరం నాటికి 89 లక్షల కోట్ల నల్లధనంగా అంచనా.

మోదీలాగానే, నెహ్రూ కూడా బినామి పేర్లతో విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొస్తానని ప్రకటించి, స్వచ్ఛందంగా నల్లధనాన్ని ప్రకటించిన వారికి రాయితీలు ప్రకటించాడు. ఈ ప్రకటన తర్వాత 1961లో గుర్తించిన 20,912 కేసులకు గాను ప్రకటించిన డబ్బు 10కోట్ల 90 లక్షలు మాత్రమే. నెహ్రూ ప్రవేశపెట్టిన ఈ పథకానికి 1975లో చట్టబద్ధత కల్పించారు. అయినా ప్రభుత్వానికి ఆదాయపుపన్ను ద్వారా 248 కోట్లు, సంపద పన్ను ద్వారా 7కోట్ల 7లక్షలు మాత్రమే వచ్చింది. దీన్ని గమనిస్తే నల్లధనాన్ని బడా కుబేరులెవ్వరూ డబ్బును బైటకుతీయలేదని వెల్లడౌతున్నది. నల్లధనం వెలికితీతకు మోదీ ప్రభుత్వం కనీసం ఇలాంటి చర్యలకు కూడా సాహసించలేదు. నల్లధనానికి, కుంభకోణాలకు అవినావభావ సంబంధం ఉంది. నల్లడబ్బు, అవినీతి కుంభకోణాలకు మూలం. దేశంలో జరిగిన కుంభకోణాలన్నీ లెక్కించటం చాలా కష్టం. వెలుగుచూసిన కొన్ని ప్రధాన కుంభకోణాలను గమనిద్దాం. నెహ్రూ కాలంలో దమానియా, ముంద్రా కుంభకోణాలు బయటపడ్డాయి. వీటిల్లో చిక్కుకున్న అప్పటి ఆర్థికమంత్రి టి.టి.కృష్ణమాచారి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. 1986లో భోఫోర్స్ ఆయుధాల కుంభకోణం దేశాన్ని కుదిపివేసింది. పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. ఫ్రాన్స్ నుంచి 1990లో ఎయిర్ బస్ ఎ320 కొనుగోలు ఒప్పందానికి సంబంధించి 2,500 కోట్ల కుంభకోణం జరిగింది. 1993లో 3వేల కోట్ల హర్షద్ మెహతా సెక్యూరిటీ స్కామ్, 1992లో ప్రధానమంత్రి పదవి కాపాడుకునేందుకు కోటి రూపాయల లంచంతో పి.వి.నరసింహారావు సూట్‌కేస్ కుంభకోణం, 2011లో జరిగిన హవాలా కుంభకోణం దేశంలో పెనుసంచలనంగా మారింది. దీన్ని జైన్ డైరీస్ కేసు అని కూడా అంటారు. రాజకీయ నాయకులు, నలుగురు హవాలా బ్రోకర్లు జైన్ సోదరుల ద్వారా నడిపిన కుంభకోణం. ఇది 18మిలియన్ డాలర్ల కుంభకోణం. ఇందులో ఎల్‌కే అద్వాని, వీసీ శుక్లా, దేవీలాల్, శరద్‌యాదవ్ లాంటి బడా నాయకులు ఉన్నారు. కోర్టు విచారణలో సాక్ష్యాలు తారుమారుతో వీరు కేసునుంచి బైటపడ్డారు. యూరియా కుంభకోణం: ఇది 1996లో నమోదై 1997లో రిజిస్టర్ అయింది. 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం.: ఇది టెలికాం కుంభకోణం. సత్యం కంప్యూటర్ల ఆడిటింగ్ కుంభకోణం, నాఫెడ్ కుంభకోణం, లలిత్ మోడి ఐపిఎల్ కుంభకోణం, కేరళ పామాయిల్ కుంభకోణం, జార్ఖండ్ మధుకోడా అక్రమాస్తుల కుంభకోణం, నితిన్ గడ్కరీ అవినీతి లాంటివి అనేకం జరిగాయి. 2022 సంవత్సరంలో ప్రభుత్వరంగ బ్యాంకుల్లో జరిగిన మోసాల్లో ఎగ్గొట్టిన డబ్బుల లెక్కలపై ఆర్‌బిఐ నివేదిక తయారుచేసింది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో 81,922 కోట్లు, 2021–22లో 40,295 కోట్లు మోసాలు జరిగినట్లు పేర్కొంది. దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలు ఉన్నంతకాలం ఇటువంటి మోసాలు జరుగుతూనే ఉంటాయి. ప్రజలసొమ్ము దోపిడీ వర్గాల పరమౌతూనే ఉంటుంది.

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

మోదీ పరువుతీసిన భజన మీడియా!

ఎం. కోటేశ్వరరావు

ప్రధాని నరేంద్రమోదీ–ఇంద్రుడు చంద్రుడు అంటూ భజన చేస్తున్న గోదీ మీడియా పరిస్థితి మింగా కక్కలేకుండా ఉంది. సామాజిక మాధ్యమాల్లో మోదీపై అనేక అతిశయోక్తులతో కూడిన కుహనా, వక్రీకరణ సమాచారం హిందుత్వ శక్తులు పుంఖాను పుంఖాలుగా ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. వాటిని నిజమే అని నమ్మిన మీడియా కూడా భుజాన వేసుకొని తరువాత తేలుకుట్టిన దొంగల్లా ఉన్న ఉదంతాలు ఎన్నో. తాజాగా మోదీని అపహాస్యంపాలు చేసే ఉదంతం జరిగింది. అది ఏ బీబీసీ లేదా మరొక విదేశీ సంస్థ చేసి ఉంటే ఇంకేముంది ? నోబెల్ శాంతి బహుమతికి మోదీ అతిపెద్ద పోటీదారుగా ఉన్నట్లు, విశ్వసనీయత ఉన్న పెద్దవాడైన రాజనీతిజ్ఞుడిగా గుర్తించినట్లుగా నోబెల్ బహుమతి కమిటీ ఉపనేత అస్లీ టోజె చెప్పారని జాతీయ మీడియా ప్రచారం చేసింది. తానసలు అలా చెప్పలేదని టోజె ఖండించాడు. అది నకిలీ వార్త అన్నాడు. మోదీకి శాంతి బహుమతి లాంఛనంగా ప్రకటించటమే తరువాయి అన్నట్లుగా మీడియా పెద్దలు కథలు అల్లారు. ఒక టీవీ సంపాదకుడు, బడా టీవీ ఛానళ్లు, పత్రికలు దున్న ఈనిందంటే దూడను గాటన కట్టేయ మన్నట్లుగా వ్యవహరించాయి.

నోబెల్ కమిటీ నిబంధనల ప్రకారం ఫలానా సంవత్సర బహుమతుల కోసం ఎందరు, ఎవరు పోటీ పడ్డారు అన్న వివరాలను ఐదు దశాబ్దాల పాటు వెల్లడించకూడదు అన్నది నిబంధన. అలాంటిది కమిటీ ఉపనేతే మోదీ ప్రధాన పోటీ దారు అని చెప్పాడంటే వాస్తవమా.. కాదా అన్నది నిర్ధారించు కోవాలి. దిల్లీలో జరిగే ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన అస్లీ టోజెతో విలేకర్లు మాట్లాడారు. టోజె చెప్పినదానిని వక్రీకరించారు. తాను నోబెల్ కమిటీ ఉపనేత హోదాలో దిల్లీ రాలేదని, అంతర్జాతీయ శాంతి అవగాహన సంస్థ డైరెక్టర్‌గా ఇండియా సెంటర్ ఫౌండేషన్(ఐసిఎఫ్) స్నేహితుడిగా వచ్చానని టోజె ఎఎన్ఐ వార్తా సంస్థతో చెప్పాడు.

అస్లీ టోజె టైమ్స్‌నౌ ఛానల్ విలేకరితో మాట్లాడుతూ "ఉక్రెయిన్ సంక్షోభంలో ప్రధాని ఒక సానుకూలవైఖరితో స్పందించారు. అణ్వా యుధాలను వాడవద్దని రష్యాను హెచ్చరించారు. వర్తమానం యుద్ధాల యుగం కాదని వ్లదిమిర్ పుతిన్‌కు చెప్పారు. ప్రపంచంలో బాధ్యత కలిగిన ఏ నేత అయినా ఇలాంటి సందేశమివ్వటానికే ఇష్టపడతారు. అన్నింటి కంటే ముఖ్యమైనదేమంటే భారత్ వంటి శక్తిమంతమైన దేశం నుంచి ఇలాంటి సందేశం వచ్చింది." అని చెప్పాడు. నకిలీ వార్తను వండి వార్చింది టైమ్స్ నౌ అని తేలింది.

ఏకంగా దాని సంపాదకుడు రాహుల్ శివశంకర్ తప్పుదారి పట్టించే ట్వీట్లు చేశారు. మోదీని పొగడటాన్ని అవకాశంగా తీసుకొని నోబెల్ శాంతి బహుమతికి ప్రధాన పోటీ దారుగా ఉన్నట్లు చిత్రించి ఆ మాటలను టోజె నోట్లో పెట్టారు. దీంతో మోదీని ఆకాశానికి ఎత్తుతూ మిగతా వారంతా నిర్ధారించుకోకుండా ప్రచారం చేశారు. ఐసిఎఫ్ చైర్మన్ వైభవ్ కె ఉపాధ్యాయ ఈ వార్త గురించి మాట్లాడుతూ టోజె చెప్పిన మాటలను తప్పుగా చిత్రించారన్నారు. టీవీ ఛానళ్లు పొరపాటున లేదా అత్యుత్సాహంతో అలా చేసి ఉండవచ్చు. పథకంప్రకారం చేసిఉంటే అది నేరపూరితం అన్నారు. ఐసిఎఫ్ కార్యక్రమం కోసం ఏర్పడిన కమిటీ సభ్యుడైన మనోజ్ కుమార్ శర్మ మాట్లాడుతూ తాను పూర్తిగా అస్లీ టోజెతోనే ఆ రోజు మౌర్య షెరటన్ హోటల్లో ఉన్నానని, టైమ్స్ నౌ విలేకరితో సహా ఇతరులతో మాట్లాడినపుడు తాను విన్నానని వారితో లేదా ప్రధాన ప్రసంగంలో గానీ మోదీ గురించి అలాంటి మాటలు చెప్పలేదని స్పష్టం చేశారు. న్యూ ఇండియన్ ఛానల్ యాంకర్ మోదీ–బహుమతి గురించి అడిగిన అంశం మీద టోజె మాట్లాడుతూ ఏ నాయకుడైనా బహుమతిని గెలుచుకొనేందుకు తగినంత కృషి చేయాలి. ముందు పని జరగాలి తరువాత బహుమతులు వస్తాయి" అన్నాడు తప్ప మోదీ పోటీదారనో మరొకటో చెప్పలేదు. నోబెల్ బహుమతి సంస్థ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం ప్రకారం 2023 బహుమతికి 305 నామినేషన్లు రాగా, వాటిలో 212 మంది వ్యక్తులవి, 93 సంస్థలవి ఉన్నాయి.



మన పత్రికలు, టీవీ ఛానళ్ల తీరు తెన్నులు, అవి ప్రచారంచేసే నకిలీ వార్తల గురించి గత సంవత్సరంలో లాజికల్ ఇండియా పేర్కొన్నవాటిని కొన్నింటిని చూద్దాం. టిప్ టిప్ భర్సాపానీ అనే మన హిందీ పాటకు పాకిస్తాన్ రాజకీయవేత్త అమీర్ లియాకత్ హుసేన్ డాన్స్ చేసినట్లు ఒక వీడియో వైరలైంది. నిజానికి అతను సాహేయిబ్ షకూర్ అనే డాన్స్‌మాస్టర్. టైమ్స్ నౌ, నవభారత్ రాజకీయవేత్తగా చిత్రించాయి. అసోంలోని ఒక టీ అమ్మే కుర్రాడు రాహుల్ కుమార్ దాస్ నీట్ పరీక్షలో తొలి ప్రయత్నంలోనే ర్యాంకు తెచ్చుకొని ఎయిమ్స్‌లో సీటు పొందినట్లు మీడియా ఒక తప్పుడు కథనాన్ని ప్రచారంలో పెట్టింది. తీరాచూస్తే అతను పరీక్ష రాసింది నిజమే కానీ వచ్చిన ర్యాంకు 9,29,881. మార్కులను తిమ్మినిబమ్మిని చేసి అతను చెప్పిన కథనాన్ని గుడ్డిగా ప్రచారం చేశారు. నిజం వెల్లడికాగానే అతను, అతని సోదరి, తల్లి కనిపించకుండా పోయారు. టీవీ9 భరత్‌వర్ష్ ఛానల్ శ్రీలంకలోని హంబంటోటా రేవు గురించి ఒక కథనాన్ని ప్రసారం చేసింది.

ఆ ప్రాంతమంతా చైనా అదుపులో ఉందని, మొత్తం ఐదు వందల తనిఖీ కేంద్రాలున్నట్లు, పైకి కనిపించకుండా చైనా మిలిటరీ ఉందని, చైనాలోని ఉఘీర్ ముస్లింలను బానిసలుగా తెచ్చి అక్కడ పనిచేయిస్తున్నారని దానిలో పేర్కొన్నది. అదంతా అవాస్తవం అని, సంచలనం కోసమే అలాంటి తప్పుడు కథనాన్ని ప్రసారం చేసినట్లు తేలింది. అసోంలో భారీ వర్షాలకు వచ్చిన వరదల్లో ఒక వంతెన కూలినట్లు ఆజ్‌తక్, టీవీ9, ఇండియాటీవీ, ఆసియానెట్, ఇతర సంస్థలు ప్రసారం చేశాయి. నిజానికి ఆ వంతెన ఏడాది క్రితం ఇండోనేషియాలో కూలింది. కర్ణాటకలోని హసన్ జిల్లాలో ముస్లిం దుండగులు హిందూ దేవతల విగ్రహాలను ధ్వంసం చేసినట్లు మీడియా సంస్థలన్నీ ప్రసారం చేశాయి. నిజానికి ఆ ఉదంతంలో పాల్గొన్నది హిందువులని తేలింది. తెలంగాణాలో వరదలు అంటూ టీవీలు ఒక వీడియోను ప్రసారం చేశాయి.

జెసిబి ట్రాక్టర్ నుంచి వరద బాధితులను కాపాడుతున్న హెలికాప్టర్ దృశ్యమది. నిజానికి ఆ ఉదంతం 2021నవంబరులో అదీ ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలోని చిత్రావతి నదిలో జరిగింది. ఒక కామెడీ కథనాన్ని నిజమని నమ్మి చైనా అధినేత షీ జిన్‌పింగ్‌ను అరెస్టు చేశారంటూ సాగించిన తప్పుడు వార్తలు, దృశ్యాల గురించి తెలిసిందే. పదకొండు సంవత్సరాల నాటి 2జి కుంభకోణంలో అరెస్టయిన మాజీమంత్రి ఏ రాజా అంటూ ఒక వార్తాసంస్థ ఇచ్చిన వార్తను అనేక పత్రికలు, టీవీలు గుడ్డిగా తాజా వార్తగా ప్రసారంచేశాయి. ఫీఫా ప్రపంచకప్‌లో అర్జెంటైనా మీద గెలిచిన సౌదీ అరేబియా క్రీడాకారులందరికీ రోల్స్‌రాయిస్ కార్లను బహుమతిగా ఇవ్వనున్నట్లు వచ్చిన తప్పుడువార్తను ప్రధాన మీడియా సంస్థలన్నీ ప్రముఖంగా ఇచ్చాయి. తమ నేత పరువుతీసిన ఈ ఉదంతం గురించి ఎలా స్పందిస్తారు?

నిరాశపర్చిన లోక్‌పాల్ పనితీరు

- అవినీతిపరులకు శిక్షలే కరువు
- పార్లమెంటరీ ప్యానల్ అసంతృప్తి



న్యూఢిల్లీ: అవినీతిపరులకు శిక్షలే కరువయ్యాయని, అవినీతి నిర్మూలన కోసం అంబుడ్స్‌మెన్‌గా ఏర్పాటైన లోక్‌పాల్ పనితీరు నిరాశాజనకంగా ఉందని పార్లమెంటరీ ప్యానల్ పేర్కొంది. అవినీతి కేసుల్లో కనీసం ఒక్కరికీ శిక్ష పడిన దాఖలాల్లేవని వెల్లడించింది. ఈ మేరకు నివేదికను పార్లమెంటుకు ఇటీవలి సమర్పించింది. నిర్దేశిత పద్ధతి (ఫార్మాట్) ప్రకారం లేవంటూ చాలా ఫిర్యాదులను లోక్‌పాల్ కొట్టివేస్తోందని, సరైన ఫిర్యాదులను తిరస్కరించొద్దని లోక్‌పాల్‌కు సూచించినట్లు నివేదిక పేర్కొంది. గతేడాది మే నుంచి ఖాళీగా ఉన్న లోక్‌పాల్ చైర్‌పర్సన్ స్థానాన్ని నేటికి భర్తీ చేయకపోవడానికి కారణం ఏమిటని ప్యానల్ ఆరా తీసింది. ఖాళీల భర్తీకి చర్యలపై కేంద్రప్రభుత్వ వివరణ కోరింది. అవినీతి ఆరోపణల కింద ఇప్పటివరకు ఒక్కరికీ శిక్ష విధించలేదని లోక్‌పాల్ నివేదించడాన్ని ప్యానల్ ప్రస్తావించింది. లోక్‌పాల్ కార్యనిర్వహణలో విఫలమైందని నివేదికలో సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, చట్టం, న్యాయశాఖపై పార్లమెంటరీ స్థాయి సంఘం సంబంధిత శాఖ వెల్లడించింది. తగిన ఫార్మాట్‌లో లేనివి మొత్తం 2,518 ఫిర్యాదులు 2022-23లో లోక్‌పాల్‌కు రాగా ఫార్మాట్ ప్రకారం ఉన్నవి 242 వచ్చాయి. వీటిలో 191 పరిష్కారమయ్యాయి. సరైన ఫిర్యాదులు తిరస్కరించొద్దని, ఖాళీల భర్తీపై శ్రద్ధ వహించాలని లోక్‌పాల్‌కు పార్లమెంటరీ కమిటీ సూచించింది. 2022 మేలో లోక్‌పాల్ చైర్మన్‌గా 70ఏళ్ల జస్టిస్ పినకి చంద్ర ఘోసె పదవీ విమరణ పొందగా అప్పటినుంచి అపద్ధర్మ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ప్రదీప్ కుమార్ మొహంతి ఉన్నారు. 2020 నుంచి ఖాళీగా ఉన్న ఇద్దరు జ్యుడిషియల్ సభ్యుల స్థానాలు నేటికీ భర్తీ కాలేదు. దీంతో లోక్‌పాల్‌లో ఖాళీల భర్తీకి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని కేంద్రానికి ప్యానల్ సూచించింది. దర్యాప్తు, ప్రాసిక్యూషన్ విభాగాలు త్వరలోనే ఏర్పాటవవుతాయని కూడా ఆకాంక్షించింది. లోక్‌పాల్‌లో 82 పోస్టులకు అనుమతి ఉంటే 32 స్థానాల్లో నియామకాలు జరిగాయి. ఒప్పంద/ఔట్‌సోర్సింగ్ విధానం కింద 62మంది సిబ్బంది విధుల్లో ఉన్నారు. దర్యాప్తు-ప్రాసిక్యూషన్ విభాగాల ఏర్పాటు, వాటికి డైరెక్టర్ల నియామక ప్రక్రియ కొనసాగుతోందని లోక్‌పాల్ వెల్లడించినట్లు ప్యానల్ నివేదిక పేర్కొంది.

రాజకీయ లబ్ధి కోసమే భగత్‌సింగ్ స్మరణ: విజయన్

తిరువనంతపురం: భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో కనీస పాత్ర లేని మతోన్మాద శక్తులకు భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల విప్లవ వారసత్వాన్ని వాడుకునే అర్హత లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ గురువారం పేర్కొన్నారు. షహీద్ దివస్‌ను పురస్కరించుకొని భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులను గుర్తుచేసుకోవడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. సమసమాజ నిర్మాణం కోసం ఆ విప్లవ వీరులు కన్న కలను సాకారం చేసేందుకు ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయన్ ట్విట్టర్ ద్వారా స్పందించారు. భగత్‌సింగ్ వంటి విప్లవ వీరులను స్మరించుకునే అర్హత మతోన్మాదులకు ఎంతమాత్రం లేదని స్పష్టంచేశారు.

9 రాష్ట్రాల్లో సీబీఐకి ప్రవేశం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: సీబీఐ కేసుల విచారణకుగాను చత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ వంటి 9 రాష్ట్రాలు తమ సమ్మతిని ఉపసంహరించుకున్నాయని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ గురువారం చెప్పారు. సాధారణంగా ఆయా రాష్ట్రాలలో కేసుల విచారణకు సీబీఐకి ఆ రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరని ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ (డీఎస్‌పీఈ) చట్టం 1946లోని సెక్షన్ 6 స్పష్టం చేస్తోందని మంత్రి రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకుండా ఏ రాష్ట్రంలోనూ సీబీఐ కేసులు విచారణ చేపట్టదని మంత్రి సింగ్ చెప్పారు. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మేఘాలయ , మిజోరం, పంజాబ్, రాజస్థాన్, తెలంగాణ, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు సీబీఐ కేసులు విచారించడానికి నిరాకరించాయని వివరించారు.

ఢిల్లీలో ఆప్, బీజేపీ పోస్టర్ వార్

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో కొంతకాలంగా ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్), బీజేపీ మధ్య ఘర్షణ వాతావరణం కొనసాగుతూనే ఉంది. మొన్నటి వరకు స్థానిక ఎన్నికలు, నేతలపై కేసుల విషయంలో వివాదం చోటు చేసుకోగా ఇప్పుడు అగ్రనేతల పోస్టర్ల వ్యవహారం దుమారం రేపుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో ఇటీవల పోస్టర్లు వెలిసిన రెండు రోజులకు కేజ్రీవాల్ వ్యతిరేక పోస్టర్లు కనిపిస్తున్నాయి. 'అరవింద్ కేజ్రీవాల్ హఠావో ఢిల్లీ బచావో' అంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి ఫొటోలతో కూడిన పోస్టర్లు కనిపిస్తున్నాయి. 'మోదీ హఠావో, దేశ్ బచావో' అంటూ ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఇటీవల పోస్టర్లు వెలిశాయి. వాటిని తొలగించిన పోలీసులు 130కిపైగా కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్టు చేశారు. పోస్టర్లపై ప్రింటింగ్ ప్రెస్ వివరాలు లేవనీ అందుకే కేసులు నమోదు చేసి విచారిస్తున్నామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. దేశ రాజధానిలో బీజేపీ కూడా కేజ్రీవాల్ వ్యతిరేక పోస్టర్ వార్‌కు దిగింది. కేజ్రీవాల్ ఫొటోతో కూడిన పోస్టర్లు ఢిల్లీ వీధుల్లో గురువారం దర్శనమిచ్చాయి. బీజేపీ నేత మంజిందర్ సింగ్ సిర్సా పేరుతో వీటిని రూపొందించినట్లు సమాచారం. ఈ పోస్టర్ల వ్యవహారంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. తనను తొలగించాలంటూ పోస్టర్లు కనిపిస్తున్నాయనీ, వాటిపై తనకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో అటువంటి పోస్టర్లు అంటించేందుకు ప్రతిఒక్కరికి హక్కు ఉందన్నారు. ప్రధాని పేరుతో పోస్టర్లు అంటించిన ఆరుగురు అమాయకులను ఎందుకు అరెస్టు చేశారో అర్థం కావడం లేదని కేజ్రీవాల్ పేర్కొన్నారు. అది పీఎం అభద్రతాభావానికి నిదర్శనమన్నారు. తనకు వ్యతిరేకంగా పోస్టర్లు అంటిస్తున్న వారిని మాత్రం అరెస్టు చేయవద్దని అరవింద్ కేజ్రీవాల్ సూచించారు.

నాలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు నియామకం

న్యూఢిల్లీ: నాలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షులను నియమించింది. బీజేపీ రాజస్థాన్ అధ్యక్షుడిగాఎంపీ సీపీ జోషి, బీహార్ అధ్యక్షుడిగా ఓబీసీ నేత, ఎంఎల్‌సీ సామ్రాట్ చౌదరిలను నియమించింది. త్వరలో జరగనున్న అసెంబ్లీల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలను పరిగణనలోకి తీసుకొని కులాల వారీగా అధ్యక్షుల నియామకం చేపట్టింది. బీజేపీ ఒడిశా అధ్యక్షుడిగా మన్మోహన్ సమల్, ఢిల్లీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న వీరేంద్ర సచ్‌దేవను పూర్తిస్థాయి పార్టీ అధ్యక్షుడిగా నియమించింది. నాలుగు రాష్ట్రాల అధ్యక్షుల నియామకాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గురువారం ప్రకటించారు. బీహార్‌లో రాజకీయంగా ప్రాముఖ్యత గల కుశ్వాహా సామాజిక వర్గానికి చెందిన చౌదరికి బీజేపీ పట్టం గట్టింది. ఎంపీ సంజయ్ జైశ్వాల్ స్థానంలో 54 ఏళ్ల చౌదరిని నియమించింది. రాజస్థాన్ పార్టీ అధ్యక్షుడిగా 47 ఏళ్ల జోషి వైపు బీజేపీ మొగ్గు చూపింది.

తప్పతాగి విమానంలో వికృత చేష్టలు : ఇద్దరి అరెస్ట్

ముంబై: విమాన ప్రయాణంలో తప్పతాగి వికృత చేష్టలకు పాల్పడుతున్న ఘటనలు ఒకటి తర్వాత ఒకటి వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. నవంబరు 26న న్యూయార్క్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిరిండియా బిజినెస్ క్లాస్‌లో ఓ మహిళపై మద్యం మత్తులో మూత్ర విసర్జన చేసిన విషయం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా అనేక విమానాల్లో ఇలాంటి ఘటనలు వరుసగా చోటు చేసుకున్నాయి. తాజాగా ఇలాంటి ఘటనే మరొకటి చోటు చేసుకుంది. బుధవారం దుబాయ్ నుంచి ముంబైకి వస్తున్న ఇండిగో విమానంలో ఇద్దరు ప్రయాణికులు తప్పతాగి తోటి ప్రయాణికులను దుర్భాషలాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని పాల్ఘర్, కొల్హాపూర్ ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఏడాదిపాటు గల్ఫ్‌లో పనిచేసి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. గల్ఫ్‌లో బయలుదేరే ముందు వారు అక్కడి డ్యూటీ ఫ్రీ షాపులో మద్యం కొనుగోలు చేశారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత విమానంలోనే మద్యం సేవించడం ప్రారంభించారు. దీనిపై తోటి ప్రయాణికులు అభ్యంతరం వ్యక్తం చేయగా వారిపై దుర్భాషలాడారు. నిందితుల్లో ఒకరు బాటిల్ చేతిలో పట్టుకుని విమానంలో నిర్లక్ష్యంగా నడుస్తూ తోటి ప్రయాణికులను ఇబ్బంది పెట్టాడు. దీంతో విమానంలోని సిబ్బంది అతడి చేతిలోని మద్యం బాటిల్‌ను బలవంతంగా తీసుకోవాల్సి వచ్చింది. విమానం ముంబైలో దిగిన అనంతరం ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించినందుకు గానూ ఇండియన్ పీనల్ కోడ్ 336 (ఇతరుల ప్రాణాలకు, భద్రతకు భంగం కలిగించేలా ప్రవర్తించినందుకు)తో పాటూ ఎయిర్ క్రాఫ్ట్ రూల్స్‌లోని 21, 22, 25 నిబంధనల కింద వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

బీజేపీ కుట్రతోనే రాహుల్‌కు జైలు శిక్ష

జార్ఖండ్ అసెంబ్లీలో కాంగ్రెస్ నిరసనలు

రాంచి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి గుజరాత్ కోర్టు రెండేళ్లు శిక్ష విధించడంపై జార్ఖండ్ అసెంబ్లీ దద్దరిల్లింది. కాంగ్రెస్ శాసనసభ్యులు గురువారం సభలో గందరగోళం సృష్టించారు. కోర్టు తీర్పు వెనుక బీజేపీ కుట్ర ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెల్‌లోకి తీసుకెళ్లి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ హిట్లర్ తరహా పాలన చెల్లదని నినదించారు. బీజేపీ ఎమ్మెల్యేలు సైతం వెల్‌లోకి దూసుకెళ్లి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతినినాదాలు చేశారు. సీట్ల కూర్చోవాలని, సభ నడపటానికి సహకరించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ రవీంద్రనాథ్ మహతో సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనా అదే పరిస్థితి ఏర్పడింది. మరోసారి సభ వాయిదా పడింది. మోదీ ఇంటిపేరుకు సంబంధించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రాహుల్‌పై 2019లో పరువునష్టం దావా వేశారు. దీనిపై సూరత్ కోర్టు గురువారం రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఆ తర్వాత రాహుల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ పైకోర్టుల్లో అప్పీల్ చేసుకోవడానికి 30 రోజులు శిక్షను నిలిపివేసింది. కాంగ్రెస్ సభ్యుడు ప్రదీప్ యాదవ్ ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తారు. దీనిని బీజేపీ అడ్డుకోవడానికి ప్రయత్నించింది. 'ప్రజాస్వామ్యంలో మా వాణి వినిపించడం నేరమా? ప్రజాస్వామ్యాన్ని బీజేపీ మంటగలుపుతోంది. దేశంలో భావప్రకటనా స్వేచ్ఛను లాగేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. దీనిని ఆమోదించడానికి వీలులేదు. బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ప్రదీప్ యాదవ్ విరుచుకుపడ్డారు. ఇతర కాంగ్రెస్ సభ్యులు కూడా ప్రదీప్‌తో గొంతు కలిపారు.

ప్రజాస్వామ్యానికి ప్రమాదం

రాహుల్‌కు శిక్షపై హేమంత్ సోరెన్

రాంచి: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడం ప్రజాస్వామ్యానికి ఆందోళనకర పరిణామమని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గురువారం వ్యాఖ్యానించారు. కమలనాథుల కుట్రలకు బీజేపీ యేతర ప్రభుత్వాలు, నాయకులు బాధితులవుతున్నట్లు విమర్శించారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ రాహుల్‌కు శిక్ష విధించడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని సోరెన్ స్పష్టంచేశారు. 'న్యాయవ్యవస్థపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. అయినా పరువునష్టం కేసులో రాహుల్‌కు శిక్ష విధించడాన్ని నేను అంగీకరించడం లేదు. బీజేపీ యేతర ప్రభుత్వాలు, నాయకులు కేంద్రం కుట్రలకు బలవుతున్నారు' అని సోరెన్ ట్వీట్ చేశారు. 'భారతదేశ ప్రజాస్వామ్య, రాజకీయ వ్యవస్థకు ఇది ఆందోళనకర పరిణామం. ధనతంత్రం ముందు ప్రజాస్వామ్యానికి విలువలేకుండా పోతోంది' అని మరో ట్వీట్ చేశారు.

ప్రతిపక్షాలను అణిచివేసే ప్రయత్నం: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించడంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఈ కేసుపై ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. గుజరాత్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కేసుల పేరుతో ప్రతిపక్షాలను వేధిస్తోందని, వారిని అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు, కాంగ్రెస్ పార్టీకి విభేదాలు ఉన్నప్పటికీ, ఈ విధంగా రాహుల్ గాంధీని పరువు నష్టం కేసులో ఇరికించడం సరికాదని ట్వీట్ చేశారు. ప్రశ్నించడమే ప్రతిపక్షాల పని అని, మేము కోర్టును గౌరవిస్తాం, కానీ నిర్ణయంతో విభేదిస్తామని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతలను, పార్టీలను అంతం చేసే కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు.

బీజేపీ నేతలకు వర్తించదా: ఎన్‌సీపీ

ముంబై: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి రెండేళ్ల శిక్ష విధిస్తూ సూరత్ కోర్టు వెల్లడించిన తీర్పుపై ఎన్‌సీపీ స్పందించింది. రాహుల్ వ్యాఖ్యలపై విధించిన శిక్షను బీజేపీ నాయకులకు ఎందుకు వర్తింపచేయడం లేదని సూటిగా ప్రశ్నించింది. కనీసం చట్టమైనా బీజేపీ నాయకుల నోరు అదుపు చేయవచ్చు గదా అని పేర్కొంది. 'సూరత్ కోర్టు తీర్పుతోనైనా రాహుల్‌గాంధీ గుణపాఠం నేర్చుకోవాలని బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఏమి మాట్లాడాలో ముందుగా ఆలోచించుకోవాలని హితవు పలుకుతున్నారు.

మన న్యాయవ్యవస్థే సుప్రీం అయినందున ఇదే సూత్రం బీజేపీ నాయకులకు కూడా వర్తింప చేయాలి గదా' అని ఎన్‌సీపీ నేత క్లైయిడ్ క్రాస్టో ట్వీట్ చేశారు.

ఆన్‌లైన్ జూదంపై నిషేధం

బిల్లుకు తమిళనాడు అసెంబ్లీ ఆమోదం

చెన్నై: ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌పై తమిళనాడు ప్రభుత్వం గురువారం నిషేధం విధించింది. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌పై నిషేధం విధించే బిల్లుకు తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. వాస్తవంగా గతంలోనే తమిళనాడు ప్రభుత్వం ఈ బిల్లును అసెంబ్లీలో ఆమోదించింది. సంతకం కోసం గవర్నరు ఆర్ఎన్ రవికి పంపింది. అయితే కొన్ని వారాల తర్వాత గవర్నరు బిల్లును ఆమోదించకుండా తిరిగి పరిశీలించాలని కోరుతూ ప్రభుత్వానికి పంపారు. బిల్లుపై ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ చాలామంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న కారణంగా బరువెక్కిన గుండెతోనే ఈ బిల్లు తీసుకొచ్చామని చెప్పారు. బిల్లును తిరిగి పంపడానికి గల కారణాలు తెలుపుతూ గవర్నరు పంపిన లేఖను స్పీకర్ ఎం.అరువు సభలో చదివి వినిపించారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో పెద్దఎత్తున డబ్బు కోల్పోయిన కారణంగా 41మంది చనిపోయారని స్టాలిన్ చెప్పారు. ఆన్‌లైన్ రమ్మీ గ్యాంబ్లింగ్‌లో రూ.17 లక్షలు నష్టపోయిన సురేశ్‌కుమార్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆన్‌లైన్ రమ్మీని నిషేధించాలని ఆ యువకుడు సూసైడ్‌లో అభ్యర్థించాడని చెప్పారు. ఇలాంటి సూసైడ్ నోట్‌ను సీఎం ప్రస్తావించారు. 'ఈ మరణాలు మన కళ్ల ముందే జరిగాయి. ఇలాంటి మరణాలను ఆపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది' అని స్టాలిన్ చెప్పారు. తన బాధ్యతను గుర్తించిన ప్రభుత్వం...ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ నిషేధానికి కొత్త చట్టం ముసాయిదాపై ప్రభుత్వానికి సలహా ఇవ్వాలని కోరుతూ మద్రాస్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి కె.చంద్రు నాయకత్వంలో కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసిందన్నారు. పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన సర్వే, ప్రజాభిప్రాయ సేకరణ వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకొని కొత్త బిల్లు రూపొందించామన్నారు. అని సర్వేలు, అభిప్రాయాలు ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌పై నిషేధం విధించాలని సూచించాయన్నారు.

టిప్పు సుల్తాన్‌పై రగులుకున్న రాజకీయం

బెంగళూరు: శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతుండడంతో కర్ణాటకలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అలనాటి మైసూర్ పాలకుడు టిప్పు సుల్తాన్‌పై బీజేపీ నాయకుడు చేసిన ప్రకటన వివాదాస్పదమైంది. ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సీటీ రవి ఇటీవల ఒక సభలో మాట్లాడుతూ తాను టిప్పు సుల్తాన్ కాలంలో పుట్టి ఉంటే 'ఊరి గౌడ, నంజే గౌడ' వలే తిరుగుబాటు చేసేవాడినని అన్నారు. పాత మైసూర్ ప్రాంతంలోని కొన్ని వర్గాలు, బీజేపీ నాయకులు ఈ ప్రకటనకు మద్దతుగా నిలిచాయి. టిప్పు సుల్తాన్‌తో వక్కలిగ పాలకులు ఊరి గౌడ, నంజే గౌడ యుద్ధం చేశారని దానిలో టిప్పు మరణించినట్లు వీరు నమ్ముతున్నారు. ఈ అంశం ఇప్పుడు వివాదానికి బీజం వేసింది. కర్ణాటకలోని బలమైన వక్కలిగ సామాజిక వర్గానికి చెందిన నేతల్లో రవి కూడా ఒకరు. వాస్తవానికి టిప్పు మరణంపై గతంలో చర్చ జరిగింది. గతేడాది 'టిప్పువిన నిజ కనసుగలు' పేరిట ఓ నాటకం విడుదలైన సమయంలో 'ఊరి గౌడ, నంజే గౌడ' పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. దీనికి రంగాయణ(థియేటర్ ఇన్‌స్టిట్యూట్) డైరెక్టర్ అడ్డండ కరియప్పా దర్శకత్వం వహించారు. ఈ నేపథ్యంలో ఒక వర్గాన్ని బుజ్జగించేలా రాజకీయాలు చేస్తున్నాయంటూ కాంగ్రెస్, జేడీ(ఎస్)ను విమర్శించడానికి బీజేపీ దీనిని వాడుకొంటోంది. మరోవైపు బీజేపీ ప్రకటనను ప్రతిపక్ష కాంగ్రెస్, జేడీఎస్, చరిత్రకారులు మాత్రం వ్యతిరేకిస్తున్నారు.

కరోనా కట్టడికి ఐదంచెల వ్యూహం

రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య శాఖ సూచన

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా అదుపులోనే ఉందనుకున్న మహమ్మారి మరోసారి కోరలు చాస్తోంది. గత ఐదు రోజులుగా వెయ్యి చేరువలో కేసులు నమోదవుతు న్నాయి. ఈ నేపథ్యంలో మహమ్మారిని కట్టడి చేసేందుకు టెస్ట్-ట్రాక్-ట్రీట్-వాక్సినేషన్, కోవిడ్ నియమావళి అనే ఐదంచెల వ్యూహంపై దృష్టి సారించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ గురువారం అన్ని రాష్ట్రాలకు సూచించింది. కరోనా కట్టడికి సంబంధించిన సన్నద్ధతను పరిశీలించేందుకు తాము మరోసారి మాక్ డ్రిల్ నిర్వహిస్తామని తెలిపింది. అన్ని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో మాక్ డ్రిల్ ఉంటుందని పేర్కొంది. దేశంలో ఇప్పటివరకు మొత్తం 220.65 కోట్ల డోసుల వాక్సిన్ ఇచ్చామని వెల్లడించింది. కోవిడ్ బారినపడి ఆస్పత్రిలో చేరేవారి సంఖ్య పెరుగుతున్న దాఖలాలు ఏమీ లేవని, ముందుజాగ్రత్త డోసులను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపింది. కోవిడ్-19 కట్టడికి అవసరమైన ఔషధాలు, వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రాలను కోరింది. కోవిడ్ వార్డుల్లో పడకల సంఖ్యను, కావాల్సినంత మంది ఆరోగ్య కార్యకర్తలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది.

140 రోజుల కనిష్ఠానికి కొత్త కేసులు: దేశంలో కరోనా కొత్త కేసులు 140 రోజుల కనిష్ఠానికి చేరాయి. గత 24 గంటల్లో 89,078 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ఏకంగా 1,300 మందికి పాజిటివ్‌గా తేలింది. ఈ స్థాయిలో కేసులు నమోదు కావడం 140 రోజుల తర్వాత ఇదే మొదటిసారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. తాజా కేసులతో దేశంలో ఇప్పటి వరకు కరోనా బారిన పడినవారి సంఖ్య 4,46,99, 418కి చేరింది. ప్రస్తుతం దేశంలో 7,605 క్రియాశీల కేసులు ఉన్నాయి. గత 24 గంటల్లో కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర లో ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు మృతి చెందారు. తాజా మరణాలతో మొత్తం కరోనా మృతుల సంఖ్య 5,30,816కి చేరింది. ఇక కరోనా మహమ్మారి నుంచి ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 4,41,60,997 మంది కోలుకున్నారు. ఇప్పటివరకు నమోదైన మొత్తం పాజిటివ్ కేసుల్లో 0.02 శాతం మాత్రమే క్రియాశీలంగా ఉన్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. రికవరీ రేటు 98.79 శాతంగా, మరణాలు 1.19 శాతంగా ఉన్నాయని పేర్కొన్నారు.

10 మంది బీమా కంపెనీ ఉద్యోగులపై కేసు

అకోల: మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలులో అక్రమాలకు పాల్పడిన 10 మంది ఓ ప్రైవేట్ బీమా కంపెనీ ఉద్యోగులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పంట నష్టానికి సంబంధించి తప్పుడు నివేదికలు సృష్టించి నకిలీ రైతుల పేరుపై రూ.3.95 కోట్లు కొట్టేసినట్లు ఆ 10మందిపై ఆరోపణలు వచ్చాయి. రైతులకు బీమా అందించడంలో ఐసీఐసీఐ లంబార్డ్ ఇన్సూరెన్స్ కంపెనీ సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు జిల్లా వ్యవసాయశాఖ సూపరింటెండెంట్ డా.మురళీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్చి 21న కదన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అకాల వర్షాలు, ఇతర ప్రకృతికి సంబంధించిన సమస్యలతో రైతులు పంటనష్టపోయినట్లు కంపెనీ ఉద్యోగులు తప్పుడు నివేదికలు తయారు చేశారని, వ్యవసాయశాఖ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేశారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అనేక సెక్షన్ల కింద నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

అప్పుచెల్లించకుండా...విదేశాల్లో ఆస్తులు కొన్నారు

విజయ్‌మాల్యాపై సీబీఐ తాజా చార్జిషీట్

ముంబై: భారతీయ బ్యాంకుల నుంచి రూ. వేల కోట్ల రుణాలు తీసుకొని విదేశాలకు పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యా ఉద్దేశపూర్వకంగానే ఎగవేతకు పాల్పడినట్లు సీబీఐ తెలిపింది. విజయ్ మాల్యాకు ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాల్లో విలువైన ఆస్తులున్నాయని తెలిపింది. ఈ మేరకు ముంబై కోర్టులో తాజాగా విదేశాల్లో మాల్యా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలతో ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. 2015-16 మధ్య కాలంలో మాల్యా ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లలో రూ. 330 కోట్ల విలువైన ఆస్తులను కొనుగోలు చేసినట్లు సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఆ సమయంలో కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొనసాగుతున్నప్పటికీ, మాల్యా విదేశాల్లో ఆస్తులు కొనుగోలు చేశారని తెలిపింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం మాల్యా బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని చెల్లించేందుకు అవసరమైన మొత్తం 2008, 2017లో ఆయన వద్ద ఉందని సీబీఐ పేర్కొంది. కానీ, ఆయన రుణం తిరిగి చెల్లించకుండా, వ్యక్తిగత ఆస్తులు కొనుగోలు చేయడంతోపాటు, కొంత మొత్తం నగదును స్విట్జర్లాండ్‌లోని తన పిల్లల ఖాతాల్లోకి బదిలీ చేశారని ఛార్జిషీట్‌లో తెలిపింది. కోర్టు అనుమతితో వివిధ దేశాల్లో విజయ్ మాల్యాకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సీబీఐ సేకరించింది. వాటి ఆధారంగా ముంబై కోర్టులో తాజాగా ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఫ్రాన్స్‌లో సుమారు 35 మిలియన్ యూరోల విలువైన ఆస్తిని కొనుగోలు చేసిన మాల్యా, దానికి 8 మిలియన్ యూరోలను తన బంధువులకు చెందిన జిజిమో హోల్డింగ్స్ ద్వారా చెల్లించినట్లు సీబీఐ పేర్కొంది.

కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం ఐడీబీఐ బ్యాంకు నుంచి రుణం తీసుకుని మోసం చేసిన కేసులో విజయ్ మాల్యాతో పాటు బ్యాంకు మాజీ జనరల్ మేనేజర్ బుద్ధదేవ్ దాస్‌గుప్తాను పేరును కూడా సీబీఐ తాజా ఛార్జిషీట్‌లో చేర్చింది. విదేశాల్లోని వివిధ సంస్థల నుంచి సేకరించిన ఆధారాల ప్రకారం 2008-2012 మధ్య కాలంలో ఫోర్స్ ఇండియా ఫార్మూలా వన్ బృందానికి మాల్యా అధిక మొత్తంలో చెల్లింపులు చేశారని తెలిపింది. రూ.9వేల కోట్ల రుణ ఎగవేత ఆరోపణలతో దేశం విడిచి వెళ్లిపోయిన మాల్యా 2016 నుంచి యూకేలో ఉంటున్నారు. ఆయనను భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అయితే, వివిధ కారణాలు చెబుతున్న విజయ్ మాల్యా అక్కడే తలదాచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

బీజేపీ కక్ష సాధింపు రాజకీయం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: మోదీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు మానుకోవాలని, విధానాలపై పోరాడాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హితవు పలికారు. విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించటాన్ని తప్పుబట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకుండా రాహుల్‌గాంధీపై కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. గుజరాత్ గ్యాంగ్ మోదీ బంధువులు 16 లక్షల కోట్ల రూపాయలు ఎగ్గొటి విదేశాలకు పారిపోయారని విమర్శించారు. బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన వారిలో 29 మంది గుజరాత్ గ్యాంగ్ ఉన్నదని తెలిపారు. రాజకీయ పార్టీల మధ్య బీజేపీ వైషమ్యాలు సృష్టిస్తున్నదన్నారు. గవర్నర్ వ్యవస్థను అప్రతిష్ఠపాలు చేస్తున్నారని విమర్శించారు. దర్యాప్తు సంస్థలు ఎలా ఉండాలో నిర్ణయించాలని సుప్రీంకోర్టు సైతం వ్యాఖ్యలు చేసిందని గుర్తు చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై సీబీఐ, ఈడీలను ప్రయోగిస్తున్నారని చెప్పారు. బీజేపీకి జైకొడితే ఇంటికి...లేకుంటే జైలుకి అన్నట్లు మోదీ వ్యవహరిస్తున్నారని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలతో పాటు సీపీఐ, సీపీఎం ఒక్కతాటిపైకి వచ్చి...బీజేపీపై పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితుల ఆధారంగా ముందుకెళ్లాలని సూచించారు. ఉత్తరాదిలో మమత, అఖిలేశ్ బీజేపీకి వ్యతిరేకంగా పనిచేయాలనే నిర్ణయానికి వచ్చారన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే జరగాలన్నారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్‌తో కలిసి పనిచేయదన్నారు. ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తుందని చెప్పారు.

జగన్ కక్షపూరిత పాలన

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కక్షపూరిత పాలన సాగిస్తున్నారని నారాయణ విమర్శించారు. కర్నూలుకు హైకోర్టు అనేది పసలేని వాదనన్నారు. మూడు రాజధాలు అనేది తప్పుడు నిర్ణయమని, దీనిని సమర్థించుకోవటం కోసం అనేక తప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 141.5 అడుగులుగా నిర్ణయిస్తే ఆ ప్రాజెక్టు ఎందుకూ ఉపయోగపడదని ఒకప్రశ్నకు సమాధానంగా చెప్పారు. విద్యుత్ ఉత్పాదన, గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్ణయానికి వ్యతిరేకంగా ఆయన కుమారుడు జగన్ ఎలా స్పందిస్తారో వేచిచూడాలన్నారు. పోలవరం ఎత్తు తగ్గించటాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామన్నారు. విశాఖలో 30 వేల ఎకరాల భూమి అదానీకి కావాల్సి ఉందని, దాని కోసం స్టీల్‌ప్లాంట్‌ను ముందుగా ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తుక్కు కింద అమ్మేస్తారని జోస్యం చెప్పారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, కేవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

జేపీసీ భయమెందుకు?

- కేంద్రానికి విపక్షాల సూటిప్రశ్న
- అదానీ వ్యవహారంలో దర్యాప్తుపై వెనక్కి తగ్గబోమని స్పష్టీకరణ
- పార్లమెంటు కాంపెక్స్‌లో నిరసన
- అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ

న్యూఢిల్లీ: అదానీ వ్యవహారంలో ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించమంటే కేంద్రప్రభుత్వానికి భయమెందుకని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించాయి. విపక్షాల కంటే అధికార పక్ష సభ్యులు ఎక్కువగా ఉండే జేపీసీతో విచారణ జరిపించేందుకు అభ్యంతరం ఏముంటుందని వ్యాఖ్యానించాయి. అదానీపై జేపీసీతో విచారణ జరిపేంత వరకు తమ పోరాటం ఆగబోదని ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీల నేతలు తేల్చిచెప్పారు. గురువారం పార్లమెంటు కాంపెక్స్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అదానీపై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తూ పార్లమెంటు భవనం ప్రధాన మార్గమైన ఒకటో నెంబరు గేటు వద్ద ఆందోళన చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆపై పార్లమెంటు గేటు నుంచి కాంప్లెక్స్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వరకు మార్చ్ నిర్వహించారు. అదానీ వ్యవహారంలో జేపీసీకి ఆదేశాలివ్వకుండా తప్పించుకునే ప్రయత్నాన్ని ప్రభుత్వం ఎందుకు చేస్తోందని నేతలు నిలదీశారు. మార్చ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నేతృత్వం వహించారు. . ఆందోళనలో ఖర్గే మాట్లాడుతూ కలిసి వచ్చిన ప్రతి ఒక్క నేతకు కృతజ్ఞతలు తెలిపారు. 'మనం అదానీ వ్యవహారంలో జేపీసీని డిమాండ్ చేస్తున్నాం కానీ కేంద్రప్రభుత్వం ఇలాంటి సరళమైన డిమాండ్‌నూ అంగీకరించడం లేదు. జేపీసీలో ప్రతిపక్ష పార్టీల కంటే అధికార పక్షం సభ్యులే ఎక్కువ మంది ఉంటారు. దీనిపై అభ్యతంమేమిటో! అదానీ వ్యవహారంలో పార్లమెంటు రికార్డుల్లో ఏమీ ఉండకూడదన్నదే బీజేపీ ఉద్దేశం. వాళ్లకి పారదర్శకత అక్కర్లేదు. అందుకే ప్రజాస్వామ్య వ్యవస్థలతో పాటు రాజ్యాంగాన్నీ నీరుగార్చే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అందుకోసమే మనం పోరాడుతున్నాం' అని ఖర్గే చెప్పారు. అంతకుముందు ఖర్గే చాంబర్‌లో విపక్ష నేతలు భేటీ అయి పార్లమెంటు హౌస్‌లో ఆందోళన చేయాలని నిర్ణయించారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌తోనూ ప్రతిపక్షాల నాయకులు భేటీ అయ్యారు. ఎగువసభలో ప్రతిష్ఠంభనను పరిష్కరించేందుకు ఆయన ఏర్పాటు చేసిన ఫ్లోర్‌లీడర్ల సమావేశంలోనూ పాల్గొన్నారు. ఈ సమావేశం అసంబద్ధంగా ముగిసిందని, జేపీసీ కోసం విపక్ష నేతలు డిమాండ్ చేశారని, దీనిపై వెనక్కు తగ్గేది లేదని తేల్చిచెప్పారని సమాచారం.

త్వరలో మరో కీలక నివేదిక

హిండెన్‌బర్గ్ ప్రకటన

వాషింగ్టన్: అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసిన అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ త్వరలో మరో కీలక నివేదిక విడుదల చేయనుంది. ఈ మేరకు సంస్థ గురువారం ఓ ప్రకటన చేసింది. అయితే తాజా నివేదిక ఎవరిపై అన్నది మాత్రం వెల్లడించలేదు. ఎప్పట్లోగా విడుదల చేస్తున్నదీ తెలుపలేదు. త్వరలో వస్తుందని మాత్రమే ట్విట్టర్‌లో ప్రకటించింది. హిండెన్‌బర్గ్ వెలువరించిన నివేదిక అదానీ గ్రూపును కుదిపివేసింది. అదానీ గ్రూపు కంపెనీల షేర్లు పతనమయ్యాయి. భారీస్థాయిలో నష్టపోయాయి. అదానీ గ్రూపు కంపెనీల మార్కెట్ విలువ 140 బిలియన్ డాలర్లకు పైగా ఆవిరైంది. గౌతమ్ అదానీ వ్యక్తిగత సంపద సైతం కరిగిపోయింది. అదానీ గ్రూప్ షేర్లలో అవకతవకలు, ఖాతాల్లో మోసాలు గురించి హిండెన్‌బర్గ్ జనవరి 23న సుదీర్ఘ నివేదికను విడుదల చేసింది. పన్నుల విషయంలో స్నేహపూరితంగా ఉండే కరేబియన్ దీవులు, మారిషస్, యూఏఈ తదితర దేశాల్లో అదానీ కుటుంబం డొల్ల కంపెనీలను నియంత్రిస్తున్నట్లు ఆరోపించింది. వీటి ద్వారానే అవినీతి, అక్రమ నగదు బదలాయింపులకు పాల్పడుతున్నట్లు వెల్లడించింది అదానీ గ్రూప్‌లోని మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో పాటు డజన్ల కొద్దీ వ్యక్తులతో మాట్లాడి, వేలకొద్దీ పత్రాలను, ఆరు దేశాల్లో కంపెనీ కార్యాలయాలను పరిశీలించాకే పక్కా ఆధారాలతో ఈ నివేదికను వెలువరించినట్లు హిండెన్‌బర్గ్ తెలిపింది. ఇప్పుడు మరొక నివేదికతో రానున్నట్లు హిండెన్‌బర్గ్ ప్రకటించడం సర్వత్రా చర్చకు దారితీసింది.

పేదలకు అండ ఎర్రజెండా

- కర్ల లింగయ్య భవన్ ప్రారంభిస్తూ రామకృష్ణ
- ఎరుపెక్కిన పెనుగంచిప్రోలు
- సీపీఐ అధ్వర్యంలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర- పెనుగంచిప్రోలు: కేంద్ర, రాష్ట్రంలో పైశాచిక పాలన జరుగుతోందనీ, ఈ పాలన అంతంకావడం ఎర్రజెండాతోనే సాధ్యమవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. పేదవారికి ఎర్రజెండా అనునిత్యం అండగా ఉంటుందని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులోని తూర్పు బజారులో కర్ల లింగయ్య కళాభవన్ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ముచ్చింతాల గ్రామం నుంచి పెనుగంచిప్రోలు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించడంతో పెనుగంచిప్రోలు ఎరుపెక్కింది... ర్యాలీ అనంతరం కర్ల లింగయ్య కళాభవన్‌ను కె.రామకృష్ణ ప్రారంభించారు. భవనం ఎదురుగా అరుణపతాకాన్ని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లీ విల్సన్ ఆవిష్కరించారు. భవనంపైన ఎర్ర జండాను సీపీఐ జిల్లా కార్యదర్శి సి హెచ్. కోటేశ్వరరావు ఎగర వేశారు. అనంతరం స్నేహ గార్డెన్లో నిర్వహించిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను దుయ్యబట్టారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కు కల్పించిందనీ, అన్ని కులాల వారికి న్యాయం చేస్తానని అందరికీ పదవులు ఇచ్చిన సీఎం జగన్ పేరుకు మాత్రమే పదవులు కట్టబెట్టి పెత్తనం మటుకు తాను ఏర్పాటు చేసుకున్న గ్యాంగుతో చెలాయిస్తున్నాడన్నారు. కేంద్ర ప్రభుత్వం మధ్యతరగతి వాళ్ల నడ్డి విరగగొడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

జల్లి విల్సన్ మాట్లాడుతూ, గొప్ప చరిత్రాత్మక ఉద్యమ స్ఫూర్తిని నిలిపిన చరిత్ర పెనుగంచిప్రోలు గ్రామానికి ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల ఉద్యమాలు ఎర్రజెండాతోనే సాధ్యమన్నారు. నందిగామ, జగ్గయ్యపేట సీపీఐకి రెండు కళ్లని, పిల్లలమర్రి వెంకటేశ్వర్లును శాసనసభ్యునిగా గెలిపించి శాసనసభకు పంపించిన ఘనత సీపీఐకి మాత్రమే దక్కుతుందని అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, ముచ్చింతాల వంటి గ్రామాలు రాజకీయాలకు కేంద్రం కావాలనీ, ఉద్యమాలకు పార్టీ కార్యాలయాలు కేంద్ర బిందువులుగా ఉండాలని అకాంక్షించారు. సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, కర్ల లింగయ్య ప్రజా నాట్యమండలిలో కళాకారుడిగా విప్లవాత్మకమైన బుర్రకథలను చెప్పేవారని బుర్ర కథలు వినిపిస్తూ ప్రజలను చైతన్యపరిచారని.... 1985వ సంవత్సరంలో పెనుగంచిప్రోలు గ్రామంలో సీపీఐలోకి యువత రావాలనీ, పార్టీ కార్యాలయం ఉండాలని దృఢ సంకల్పంతో ఆ రోజులలోనే 25 వేల రూపాయలు విరాళంగా అందించారని తెలిపారు. సీపీఐ జిల్లా డిప్యూటీ సెక్రెటరి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ప్రజా సమస్యలు తీరి ప్రజల సుభిక్షంగా ఉండాలంటే ఒక్క ఎర్ర జెండాతోనే సాధ్యమవుతుందన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, జిల్లా కార్యదర్శి. లంకా గోవిందరాజులు కూడా మాట్లాడారు. జగ్గయ్యపేట మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ నూతన భవనాన్ని సందర్శించారు. సభానంతరం గ్రామ వైకాపా ప్రముఖులు వేల్పుల రవికుమార్, గ్రామ మేజర్ పంచాయతీ ప్రధాన పౌరురాలు వేల్పుల పద్మ కుమారి సీపీఐ శ్రేణులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు పి చంద్ర నాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య అధ్వర్యంలో ఆలపించిన విప్లవగేయాలు ఉత్తేజపరిచాయి. కార్యక్రమానంతరం గ్రామం మొత్తానికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, మాజీ ఎంపిపి పొన్నం. నరసింహారావు.నందిగామ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చుండూరు. సుబ్బారావు.మండల కార్యదర్శి కనకపుడి బాబూ రావు, జక్కులూరి వెంకటేశ్వర్లు. పొన్నం. రవి. చాట్ల. లక్ష్మయ్య, కర్ల లింగయ్య మనువడు. తిరుపతమ్మ అమ్మ వారి ఆలయ మాజీ చైర్మన్ కర్ల. వెంకటనారాయణ.మాజీ ఎంపీపీ. వేగినేటి. గోపాల కృష్ణమూర్తి, ఆంబోజి. శివాజీ. ఇంటూరి. నాగేశ్వర రావు. జోన్నేబోయిన. శ్రీనివాసరరావు. చల్లాల. శివాజీ.(సిద్దాంతి) వేల్పుల. కాంతయ్య. వట్టికొండ. చంద్రమోహన్. తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్, కొరటాల శివ సినిమా ప్రారంభం

హైదరాబాద్: ఎన్టీఆర్, కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా పూజా కార్యక్రమం గురువారం ఉదయం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. దర్శకధీరుడు రాజమౌళి ముఖ్య అతిథిగా పాల్గొని ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. పూజా కార్యక్రమం అనంతరం.. నిర్మాత శ్యామ్ ప్రసాద్ రెడ్డి.. చిత్రబృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. 'ఎన్టీఆర్30' పూజా కార్యక్రమంలో జాన్వీ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిత్రబృందంతో ఆమె కలివిడిగా కనిపించారు. తన అభిమాన నటుడు ఎన్టీఆర్‌ని కలిసిన సమయంలో ఆమె ఆనందం మరోస్థాయిలో ఉంది. ఎన్టీఆర్ పలకరించగా.. ఆమె ఎంతో ఆనందించారు. కాసేపు సరదాగా మాట్లాడారు. అలాగే రాజమౌళితోనూ ఆమె ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, కొరటాల శివ, జాన్వీకపూర్, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, సంగీత దర్శకుడు అనిరుధ్, నిర్మాత కల్యాణ్ రామ్ తదితరులు సందడి చేశారు.

విశాలాంధ్ర రీల్

బ్రహ్మానందంకు 'చిరు' సత్కారం

హైదరాబాద్: తెలుగు సినీ తెరపై ఒక్కసారి కమెడియన్ బ్రహ్మానందం అలా కనిపిస్తే చాలు, స్టార్ నటీనటులకు ధీటుగా ఆయన సీన్స్‌కు రెస్పాన్స్ వస్తుంటుంది. ఆ విధంగా మొదటి నుండి తెలుగు ప్రేక్షకులని తనదైన హాస్య పాత్రలతో కడుపుబ్బా నవ్వించి ఆకట్టుకున్నారు బ్రహ్మానందం. అయితే తన కెరీర్‌లో తొలిసారిగా క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన రంగమార్తాండ మూవీలో ఒక సీరియస్ రోల్‌లో కనిపించారు బ్రహ్మానందం. ఉగాది సందర్భంగా విడుదలైన రంగమార్తాండ సక్సెస్ ఫుల్‌గా థియేటర్స్‌లో ప్రదర్శితమవుతోంది. సినిమాను చూసిన ప్రతీ ఒక్కరూ బ్రహ్మానందం నటనకు ముగ్ధులవుతున్నారు. ఇన్నాళ్లు మనల్ని నవ్వించిన బ్రహ్మానందం ఇలా ఏడిపించేశారు ఏంటి? అని అనుకుంటున్నారు. థియేటర్లో బ్రహ్మానందం సీన్లకు ప్రతీ ఒక్క ఆడియెన్ కంటతడి పెట్టేసుకుంటారు. బ్రహ్మానందం నటించిన పాత్రకు ఇంత మంచి పేరు రావడంతో మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. బ్రహ్మానందంకి శాలువాతో సత్కరించారు.

సెప్టెంబర్ 1న విజయ్ దేవరకొండ, సమంత ఖుషీ

హైదరాబాద్: విజయ్ దేవరకొండ, సమంత జంటగా రూపొందుతోన్న సినిమా ఖుషీ. అందమైన ప్రేమకథతో సెన్సిబుల్ మూవీ మేకర్‌గా పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. నిన్ను కోరి, మజిలీ వంటి సకుటుంబ ప్రేమ కథల్ని తెరకెక్కించిన శివ నిర్వాణ మరోసారి వెండితెరపై తనదైన మ్యాజిక్ చేయబోతున్నారు. గతంలో మహానటి చిత్రంలో విజయ్, సమంత కలిసి నటించారు. ఖుషీతో ఈ ఇద్దరూ జంటగా పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్ రాబోతోంది. కశ్మీర్‌తో పాటు ఎన్నో అందరమైన ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 1న ప్రపంచ వ్యాప్తంగా తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రంలో జయరాం, సచిన్ ఖేడేకర్, మురళీ శర్మ, లక్ష్మీ, అలీ, రోహిణి, వెన్నెల కిషోర్, రాహుల్ రామకృష్ణ, శ్రీకాంత్ అయ్యంగార్, శరణ్య ప్రదీప్ తదితరులు నటించారు.

హైదరాబాద్‌లో

విజయవాడలో

జర్నలిజాన్ని కాపాడండి

- తెలుగు రాష్ట్రాల్లో నినదించిన పాత్రికేయులు
- ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే, టీయూడబ్ల్యూజే నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛను చిదిమేస్తున్న పాలకుల విధానాలకు నిరసనగా భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు గురువారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏపీయూడబ్ల్యూజే, టీయూడబ్ల్యూజే అధ్వర్యాన జర్నలిస్టులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా యూనిట్లు, అనుబంధ ప్రెస్‌క్లబ్‌ల అధ్వర్యంలో ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు, సమావేశాలు నిర్వహించారు. హైదరాబాద్‌లో తెలంగాణ గవర్నర్‌తోపాటు జిల్లా కలెక్టర్లు, జేసీలు, తహసీల్దార్లకు నేతలు వినతిపత్రాలు అందజేశారు. భగత్‌సింగ్ చిత్రపటాలు, బ్యానర్లు, ప్లకార్డులు చేతపట్టుకుని జర్నలిస్టులు 'సేవ్ జర్నలిజం, సేవ్ డెమోక్రసీ' అంటూ నినదించారు. దేశంలో ప్రజాస్వామ్య మనుగడ కొనసాగాలంటే స్వతంత్ర పత్రికారంగాన్ని కాపాడుకోవాలని, పాత్రికేయుల హక్కులకు, సంక్షేమానికి, వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పీఐబీ ఎదుట ఆందోళన అనంతరం రాజ్‌భవన్‌లో ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో జర్నలిస్టు నేతలు గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి దేశంలో, రాష్ట్రంలో మీడియా స్థితిగతులను, జర్నలిస్టుల సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. పాలకుల ఇష్టాయిష్టాలకు లొంగని జర్నలిస్టులు, మీడియా సంస్థల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని, బడా కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం నుండి మీడియాను తప్పించాలని కోరారు. సంపాదకుల, స్వతంత్ర జర్నలిస్టుల స్వేచ్ఛను కాపాడాలని, ఐటీ నిబంధనల ముసుగులో డిజిటల్ మీడియాకు సమస్యలు సృష్టించడం సరైంది కాదన్నారు. పోరాటాల ఫలితంగా జర్నలిస్టులు సాధించుకున్న రైల్వే ప్రయాణాల్లో రాయితీ లాంటి సౌకర్యాలను పునరుద్ధరించాలని, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ మీడియా అక్రిడిటేషన్ కమిటీలలో గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60 సెంటర్లలో వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. విజయవాడలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐవీ.సుబ్బారావు అధ్యక్షతన ప్రెస్‌క్లబ్ ఎదుట ఆందోళన అనంతరం సమావేశం నిర్వహించారు. ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు చావా రవి, యు.వెంకట్రావు, ఐజేయూ సభ్యులు షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభకు ఏఐటీయూసీ, సీఐటీయూ, వివిధ సంఘాల కార్మిక నాయకులు పాల్గొని జర్నలిస్టుల ఆందోళనకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, శ్రీకాకుళంలో ఐజేయూ కార్యవర్గసభ్యులు నల్లి ధర్మారావు, తిరుపతిలో ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.